# ధర్మ వ్యాధుడు

పౌరాణిక సాంఘిక నాటకం

బోయి భీమన్న

ప్రతులు: 1000 కాపీలు

ప్రచురణ: సెప్టెంబరు, 1999

హక్కులు: రచయితవి

మూల్యం: 75/-

ప్రతులకు

భీమన్న సాహితీ నిధి,

ఐ.సి. 85, ఇర్రంమంజిల్ కాలనీ,

హైదరాబాదు-82

ముఖచిత్రం

డా॥ పి.ఆర్. రాజు

లేజర్ టైప్ సెట్టింగ్

భారతి కృష్ణ

ఎల్.కె. డిటిపి. సెంటర్

ఆర్.కె. నగర్, మల్కాజిగిరి

సికింద్రాబాద్ - ఫోన్ :7060946

ముద్రణ

వెంచర్ కమ్యూనికేషన్స్,

1-80/2, కూకట్ పల్లి,

హైదరాబాద్ - ఫోన్: 3064752

# ధర్మపీఠం

నాకు నా బాల్యం నుంచీ కూడ ధర్మవ్యాధుడితో సాన్నిహిత్యం వుంది. చిన్నప్పటి క్లాసు వాచకాలలో నన్ను బాగా ఆకర్షించిన కథ "కొంగ - కౌశికుడు".

ఎంతో తపస్సు చేసిన కౌశికుడికి చూపుతోనే కొంగను భస్మం చెయ్యగల శక్తి సంక్రమించవచ్చు. సాత్వికాహారి కానివాడు, ఏ తపస్సూ చెయ్యనివాడు, జంతువుల్ని వేటాడే వాడు, మాంసం అమ్ముకొని బ్రతికే వాడు, సోఫిస్టికేటెడ్ సొసైటీకి చెందని వాడు, ఆహంకారిక సమాజానికి అంటరాని వాడు అయిన ఒక హరిజనుడు త్రికాలవేది కాగలిగాడంటే, కౌశికుడి లాంటి ఉగ్ర స్వభావుడైన బ్రాహ్మణుడికి ఉపదేశికుడు కాగలిగాడంటే ఎంతటి మహత్తరత !

నాకు పధ్నాలుగు ఏళ్ళు వచ్చే వరకు, అంటే ఫస్టు ఫారంలోకి వెళ్ళే వరకు, అంటే పద్యాలు వ్రాయడం మొదలైనప్పటి వరకు నేను ఉభయాహారిని. అంటే శాకాహారినీ, మాంసాహారినీ కూడ.

ఇక్కడొక వివరణ చెప్పాలి.

మనవాళ్ళు ఆహారం విషయంలో ఉపయోగించే రెండు మాటలలోను వెజిటేరియన్ (శాకాహారం) అన్నమాట సరయిందే. నాన్ వెజిటేరియన్ (మాంసాహారం) అన్నమాట అర్థవంతం కాదు. నాన్ వెజిటేరియన్ ఇళ్ళలోనూ, హోటళ్ళలోనూ, బార్లలోనూ కూడ వెజిటేరియన్ ఆహారం పుష్కలంగా వుంటుంది.

ఏ నాన్ వెజిటేరియనూ వెజిటేరియన్ ఆహారాన్ని నిషేధించిన వాడు కాడు. మాంసాహారానికి అభ్యంతరం లేనివాడు. మాంసాహారం దొరికినప్పుడు తప్ప ప్రతి నిత్యము శాకాహారం తినేవాడే.

అందుకే ఈ ఉభయ వర్గాలను వెజిటేరియన్, కాస్మో పాలిటన్ (శాకాహారి, ఉభయాహారి) అంటున్నాను.

నా పధ్నాలుగో ఏట నేను మాంసాహారం మానేసి, పూర్తి శాకాహారిని అయ్యాను – మా అయ్యతో పాటు. ఆయన అప్పటికే శాకాహారి అయి, తన శిష్యుల్ని కూడ చాలా వరకు శాకాహారుల్ని చేశాడు. శాకాహారం సాత్వికాహారమనీ, అందుకే బ్రాహ్మలు అంత గొప్ప వాళ్ళుగా వున్నారనీ, మాంసాహారం మెదడును మొద్దుబారుస్తుందనీ, పైగా అది హింసాత్మకమనీ సమాజం విశ్వసిస్తూ వుంది. ఈ అన్నిటి ప్రభావమే నేను మాంసాహారాన్ని వర్జించడానికి కారణం.

ఈ నా శాకాహార దీక్ష మూడేళ్ళ పాటు కొనసాగింది – నేను రాజోలు హైస్కూలులో ఫోర్తు ఫారంలో చేరి, అక్కడ ఒక కమ్మవారి హోటలులో భోజనం చెయ్యడం మొదలు పెట్టే వరకు.

ఈలోగా నేను నన్నయ భారతం క్షుణ్ణంగా చదవడం జరిగింది. ధర్మవ్యాధుడి హితబోధ కంఠస్థం కావడమూ అయింది.

మును దము చేసిన కర్మం
బున నూవె నశించు భూతములు, చంపెడు వా
డు నిమిత్త మాత్రు డంతియె,
అని చెప్పగ వినమె అంచితాచార్యులచే ?

సలిలము లుర్వి యాకసము
సర్వము జంతు మయంబు, కావునన్
కలుగు నవశ్యమున్ సకల
కర్మల యందును హింస, హింసకున్
దొలగిన దేహయాత్ర కడు
దుర్ఘట మైనటు లుండు, ఇంతయున్
దలపరు, హింస చేయమని
వారు దలంతురు కొందరి మ్మహిన్

వంటి ధర్మవ్యాధుడి బోధలు (నన్నయ గారి పద్యాలు) నన్ను ఉద్బోధించి, హింస నిజస్వరూపాన్ని ఆవిష్కరించి, నేను మళ్ళీ ఉభయాహారిని కావడానికి తోడ్పడ్డాయి.

## తాతగారి ప్రభావం

సంప్రదాయ చిత్తుడైన మనమణ్ని తాతగారు వలె, నన్ను ధర్మవ్యాధుడు నా బాల్యం లోనే పట్టుకొని, ఎలా తన ప్రభావం లోకి ఆకర్షించుకున్నాడో పరిశీలిస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది !

వేల సంవత్సరాల పూర్వపు కృతయుగం నాటి ధర్మవ్యాధుడి ప్రభావం ఈనాడు నా మీద పడ్డంతగా మరెవరి మీదా పడలేదనే నా ఉద్దేశం. ఈ యుగంలో నేనే ధర్మ వ్యాధుడి సరాసరి (డైరక్టు) వారసుణ్నని నేను చెప్పుకోడానికి ఇదే కారణం.

"అయితే, అంతటి గొప్ప వాడి వెందుకు కాలేక పోయావ్?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, అట్టి వారికి నా జవాబు–

"అనాడు ధర్మవ్యాధుడు కూడ, అన్ని శక్తులున్న బ్రహ్మజ్ఞాని అయి వుండి కూడ, అప్పటి సమాజం దృష్టిలో వట్టి కటిక వాడే కదా? అంటరాని వాడే కదా? ఆత్మజ్ఞాన లక్షణమే అట్టిది."

ఆ నాటి నుంచి, అంటే 1928 ప్రాంతం నుంచి, నేను ధర్మ వ్యాధుడికి చెందిన వాణ్ననుకొంటూ వుండడం తప్ప, అతడి వంశ చరిత్ర గురించి నేనంతగా పట్టించుకోలేదు. చాల సంవత్సరాల తర్వాత, వరాహ పురాణాన్ని విమర్శనాత్మకంగా చదివిన తర్వాత, నాకు నిజంగా జ్ఞానోదయ మయింది – ఈ భారత జాతి పుట్టుపూర్వోత్తరాలను గురించి!

అప్పుడు వ్రాశాను ఈ ధర్మవ్యాధుడు నాటకాన్ని – నలభై యేళ్ళ క్రితం, 1960 ప్రాంతంలో !

ధర్మ వ్యాధుడు కర్మయోగి. ఆత్మ జ్ఞాని. అపరోక్ష సాక్షాత్కారం పొందినవాడు. అంతర్ముఖుడు. బ్రహ్మైక్యం చెందిన వాడు. జీవన్ముక్తుడు. అట్టివాడికి లౌకిక విషయాలలో ఆసక్తి వుండదు. బ్రతకడం కోసం కర్మ చేస్తాడు. అంటే పనిచేస్తాడు. అంతేకాని, దేని కోసమూ ఎగబడడు. పోటీ పడడు. పనిచేసి సంపాదించుకొన్న దానిని

అనుభవిస్తాడు. మిగిలిన దానిని పంచి పెడతాడు. మరునాటి కోసం దాచుకోడు. భవిష్యత్తు గురించి ఆందోళన పడడు. అయాచితంగా తన వద్దకు వచ్చిన దానిని మాత్రమే స్వీకరిస్తాడు. స్వీయ కష్టార్జితాన్ని మాత్రమే అనుభవిస్తాడు.

అలాంటి అంతర్ముఖుడికి, బ్రహ్మజ్ఞానికి ప్రచారం వుండదు. గుర్తింపు కూడ వుండదు.

మానవ విలువలకు విలువ గల కాలం కాబట్టి, ధర్మవ్యాధుడి చరిత్ర ఆనాడు పురాణాలకు ఎక్కగలిగింది. మానవ విలువలకే కాదు, ఏ విధమైన సద్గుణాలకూ, సౌశీల్యాలకూ, సామర్థ్యాలకూ విలువలు లేని ఈనాడైతే - ధర్మ వ్యాధుడు లక్షా తొంభై మంది కటిక వాళ్ళలో ఒకడై, నామరూపాలు లేకుండా పోయేవాడు.

ఆనాడైనా - వాల్మీకి, వ్యాసుడు వంటి మహర్షులు, కాళిదాసు, పెద్దన వంటి మహాకవులు అప్పటి రాజ వంశాలతో సంబంధాలు పెట్టుకున్న వాళ్ళూ, రాజాస్థానాల కవులూ కనుకనే వాళ్ళ కంతటి ప్రచారం వచ్చి వుంటుందని నా భావం. అంతకంటె మహత్తర ప్రతిభావంతులైన ప్రజా కవులకు గుర్తింపే లేకపోయింది. జానపద గేయాల కవులెవరు ? వారి పేర్లేమిటి ? వేద, పురాణ, కావ్య, ప్రబంధ, సాహిత్యాని కంతకూ ఆధారభూతమైన జానపద సాహిత్యాన్ని సృష్టించిన మూల బ్రహ్మల ఆచూకి కూడ మనకు తెలియదే ! కారణం? రాజాశ్రయం లేక. రాజాశ్రయాన్ని కోరక.

వాల్మీకి సీతను కష్టకాలంలో ఆదుకొన్నవాడు. వ్యాసుడు ఒక మహారాజ వంశానికే మూలపురుషుడు. కాళిదాసు, శ్రీనాధుడు, పెద్దన వగైరాలు చక్రవర్తుల తోనే సహపంక్తి భోజనాలు చేసే గొప్పవాళ్ళు.

ఈనాడు కూడ, ప్రజాస్వామిక రాజ్యాలలో కూడ రాష్ట్రాధినేతలుగా వున్న రాజకీయ నాయకులకు కుటుంబ మిత్రులో, జైలు మిత్రులో అయిన వాళ్ళకే తప్ప - అనాసక్త కళాతపస్వులూ, అంతర్ముఖులూ అయిన సర్వజనీన ప్రజాకవులకూ, ప్రజాగాయకులకూ, ప్రజానటులకూ గుర్తింపెక్కడుంది?

## ఆధునిక అరిషడ్వర్గాలు

బంధుత్వం, కులత్వం, మిత్రత్వం, మతత్వం, పార్టీలో ముఠాత్వం, పార్టీత్వం - ఇవి ఆరూ ఈనాటి అరిషడ్వర్గం. ఇవే ఈనాటి ఏ ప్రజాపాలకులైనా, ఎవరినైనా అభిమానించడానికి పెట్టుకొన్న అర్హతలు. ఇవే క్రమాలంకారంలో ఈనాటి మెరిట్ !

ఆనాడు కూడ అంతే. గట్టి గింజలు మునిగిపోయి, తప్పలు తేలి సన్మానా లందుకొనే పద్ధతి నాడు వుంది. నేడు వుంది.

ఆనాడు ధర్మవ్యాధుడికి ఏ ప్రచారమూ లేకపోయినా, ఏ గుర్తింపూ లేకపోయినా, సమకాలీన సమాజాన్ని ప్రభావితం చెయ్యగలిగా డతడు. చరిత్రలో కెక్క గలిగాడు. శాశ్వతీకీర్తు డైనాడు. అతడి లక్షల తరాల క్రింది వారసుణ్ని నేను కూడ అదే జాతకంలో పుట్టడం నిజంగా అద్భుతం ! ఆధునిక అస్నైక జీవులకు అవిశ్వసనీయం !

ధర్మ వ్యాధుడి చరిత్ర క్లుప్తంగా ఇది:

కౌశికుడు అనే కుర్రవాడు ఒక చెట్టు క్రింద కూర్చుని తపస్సు చేసు కుంటున్నాడు. అతడు బ్రాహ్మణ కులం వాడు. ఆనాడు వృత్తి వర్గాలే కులాలు. వృత్తుల పేర్లతోనే కులాలు పిలవబడేవి.

చదువు వృత్తిగా కలవాడు బ్రాహ్మడు. వేట వృత్తిగా కలవాడు వ్యాధుడు. అయితే - చదువు వృత్తిగా కలవాడి కొడుకులంతా మళ్ళీ చదువునే వృత్తిగా స్వీకరించకపోవచ్చు. వేటగాడి కొడుకు లంతా మళ్ళీ వేటగాళ్ళు గానే తయారు కాకపోవచ్చు. ఒక్క తల్లికీ, తండ్రికీ పుట్టిన నలుగురూ నాలుగు వేరు వేరు వృత్తుల్ని స్వీకరించి, నాలుగు వేరు వేరు కులాలకు చెంది పోవచ్చు. గుణాలనూ, వృత్తులనూ బట్టే కులాలేర్పడే వానాడు. పుట్టుకతో కులం ఏర్పడడమనే పద్ధతి లేనే లేదు.

తపస్సు చేసుకొంటున్న కౌశికుడి మీద ఒక కొంగ రెట్ట వేసింది. ఉలిక్కిపడి అతడు దానికేసి కోపంతో చురచుర చూశాడు. ఆ కోపాగ్నికి ఆ కొంగ భగ్గున మండి, చచ్చి పడిపోయింది.

చావనీ, వెధవ కొంగ అనుకొంటూ లేచి, మధ్యాహ్నం సూర్యుడు పైనా, ఆకటి చిచ్చు లోనా తనను దహించడం మొదలుపెట్టగా - భిక్షకు బైలుదేరా డతడు. నచ్చిన ఒక ఇంటి ముందు నిలబడి, భిక్షాందేహి అన్నాడు.

ఆ ఇంటి ఇల్లాలు తలుపు తెరిచింది. భిక్ష తెస్తున్నానని చెప్పి లోనికి పోయింది. కౌశికుడు వాకిట్లోనే నిలుచున్నాడు. ఆ ఇల్లాలు ఎంతకూ తిరిగి రాలేదు.

పైనా, లోనా మండుతున్న అగ్ని కళ్ళల్లోకి వచ్చేసింది కౌశికుడికి. ఆలస్యమయ్యే కొలదీ అగ్ని పర్వతమే అయిపోయా డతడు.

కొంత సేపటికి ఆమె తలుపు తెరిచి, భిక్షతో బైటికి వచ్చింది. లావా వెలి గ్రక్కుతున్న అతడి నేత్ర గహ్వరాలను చూచి, అక్కడే ఆగిపోయింది. క్షణం యోచించి, చిరునవ్వుతో ముందుకు వచ్చి, అతడి పాత్రలో భిక్షవేసి, వినయ స్వరంతో అంది-

"బాబూ, నీవు చిన్నవాడివి. అయినా, నా ఆలస్యానికి క్షమించు. వెంటనే వద్దా మనుకున్నాను. అంతలో పొలం నుంచి మా ఆయన వచ్చాడు. కాళ్ళు కడిగి, మంచి నీళ్ళిచ్చి వచ్చేటప్పటికి, కొంచెం ఆలస్య మయింది."

క్షమించుమని కోరినా, అతడి చూపులలోని నిప్పులు చల్లారక పోవడం చూచి, ఆమె మళ్ళీ అన్నది -

"అయినా, నీకింత దురాగ్రహం కూడదు. నీ ఈ క్షణాగ్నితో భస్మం కావడానికి నేను కొంగనేం కాను."

అంతటి అగ్ని పర్వతమూ మంచుగడ్డ ముక్కై పోయిందా మాటతో. వడవడ లాడిపోయాడు కౌశికుడు. పడిపోయాడామె పాదాల మీద.

క్షమా భిక్ష పెట్టమన్నాడు. జ్ఞాన భిక్ష పెట్టమన్నాడు.

"నా జ్ఞానం నా సేవా దీక్షకు ఫలితం. అది నాకే పరిమితం. నీకు పెట్టడానికి చాలదు. నీకు గురువుగా జ్ఞాన భిక్ష పెట్టగలవాడు ధర్మవ్యాధు డొక్కడే. పోయి అతణ్ని ఆశ్రయించు" అన్నదామె. ధర్మవ్యాధుడి అడ్రస్సు కూడ చెప్పింది. ఆశీర్వదించింది.

ధర్మవ్యాధుణ్ణి వెతుక్కొంటూ వెళ్ళాడు కౌశికుడు. పట్టుకొన్నా డతణ్ణి. జ్ఞానోపదేశమూ పొందా డతడి వద్ద.

## జ్ఞానం వ్యక్తిగతం

ఎవరీ ధర్మ వ్యాధుడు ? అతడు మిధిలా నగరంలో మాంస విక్రయం వృత్తిగా గల ఒక వ్యాధుడు. కిరాతకుడు. బోయ. ఇప్పటి భాషలో చెప్పాలంటే ఒక అస్పృశ్యుడు. హరిజనుడు. వృత్తికి కసాయి వాడైనా – అతడు శాస్త్రజ్ఞుడు, ధర్మజ్ఞుడు, దైవజ్ఞుడు, బ్రహ్మజ్ఞుడు కనుక, అందరి చేతా గౌరవించబడుతూ గురుస్థానంలో వుండేవాడు.

అతడికి అర్జునుడు అనే కొడుకూ, అర్జునకి (అర్జుని అంటున్నాను నేను) అనే కూతురూ వున్నారు. వాళ్ళకి వేట సరదాయే కాని, వృత్తి కాదు.

ఒకసారి ఒక మృగయావిహార సందర్భంలో అర్జునీ అర్జునులు, ప్రసన్నుడనే యువకుణ్ణి కలుసుకోవడం జరిగింది. అప్పుడు అర్జునీ ప్రసన్నుల మనస్సులు కలవడం (ఈ సంఘటన నా కల్పన), ధర్మవ్యాధుడు మతంగ మహర్షిని కలిసి ఆయన కొడుకు ప్రసన్నుడికి తన కుమార్తె నివ్వజూపడం, వివాహం జరగడం క్రమంగా జరిగిపోయాయి.

మతంగ మహర్షి కూడ ఇప్పటి భాషలో చెప్పాలంటే – అంటరాని వాడే. హరిజనుడే. ప్రథమ చండాలు డాయన.

తాను చెయ్యని పాపానికి వెలివేయబడి, వదిలి వేయబడి, అవమానించబడి, అంటరాని వాడుగా చెయ్యబడి, ఒక పశువు (గాడిద) పలికిన చాడీకోరు మాటల వల్ల తన బ్రాహ్మణత్వాన్నే పోగొట్టుకోవలసి వచ్చిన దురదృష్టవంతుడు మతంగుడు.

మనిషి నిజం చెప్పడు కదా ! పైగా, కోపంగా వున్నప్పుడు, కక్ష సాధించే గుణంతో ఎంతటి అబద్ధమైనా చెపుతాడు కదా? పశువు, అందులోనూ గాడిద, నిజం చెప్పిందన్న గ్యారంటీ ఏమిటి ? దెబ్బతిని వున్న గాడిద మాటలు నమ్మి సొంత భార్యను అనుమానించిన బ్రాహ్మడు, వాడెలాంటి బ్రాహ్మడు? కనీసం మానవుడుగా కూడ పరిగణించబడ జాలడే? మరి, అతడు భార్యను తప్పు పట్టి, ముక్కుపచ్చలారని కొడుకుని వెలివేసి, ఇలు వెడల గొడితే – సంఘ పెదలెలా వూరుకున్నారో ?

సరే, పెద్దలెవరూ విజ్ఞత చూపకపోయినా, ఘోర దురన్యాయానికి గురైన మతంగుడు తల్లిదండ్రులైన బ్రాహ్మణుల మీదా, సమాజం మీదా ప్రచండమైన కోపాన్ని ప్రదర్శించేశాడు. దాని ఫలితంగా కోపిష్టి, చండుడు, చండాలుడు అనే బిరుదు సంపాదించుకొన్నాడు. పేద కోపం పెదవికి చేటన్నట్టు, తన సత్యాగ్రహం స్వయం ఘాతకమే కాగా, ఏ స్వాములవారో సలహా చెప్పగా – పోయిన బ్రాహ్మణత్వం కోసం తపస్సు ప్రారంభించాడు. "పర్ణ భక్షుడు, వారి భక్షుడు, వాయు భక్షుడు" అయి, అదే అలవాటయి, శాకాహారి అయినాడు.

మతంగుడు పుట్టుక తోనే బ్రహ్మజ్ఞాని. పశు పక్ష్యాదుల భాషలు కూడ తెలిసిన వాడు. అన్ని విధాలా దైవ సముడు. తత్సముడు. వైజ్ఞానిక కుటుంబంలో పుట్టి, వైజ్ఞానిక వాతావరణంలో పెరిగి, అన్ని విద్యలూ క్షుణ్ణంగా నేర్చిన వాడు. జగన్మాత అయిన సీత, ఒక్క పామరుడి పనికి మాలిన మాటకు ఆహుతి అయిపోయినట్టు, ఈనాడు పరమ పవిత్రశీలుడైన మంత్రి ఒక ప్రతిపక్ష ఆరోపణకు పత్తా లేకుండా పోయినట్టు – ఒక గాడిద అక్కసు కూతకు మతంగుడు అధఃపతనమై పోయాడు. ఎవడికి వాడే వ్యక్తిగతంగా, స్వతంత్రంగా బ్రతకగల్గిన నేటి వలె కాక సమాజం వెలి వేస్తే నిప్పు, నీరు, తిండి, బట్ట లభించని ఆనాడు వెలివేయబడ్డ మతంగ బాలుడు ఎన్ని ఇక్కట్లు పడ్డాడో ఊహించుకొంటే నిజంగా భయం వేస్తుంది.

అలా దీనుడుగా, దిక్కు మాలినవాడుగా, అంటరాని వాడుగా చేయబడ్డ బ్రాహ్మణ కుమారుడు, బ్రహ్మజ్ఞాని మతంగుడు గత్యంతరం లేక కఠిన నిష్ఠాగరిష్ఠుడై, శాకాహార వ్రతం అవలంబించి, తపస్సు ప్రారంభించాడు. ఆర్ష ధర్మి కనుక, రాజయోగంలో, సంసారా శ్రమంలో వున్నా డప్పటికి – ధర్మవ్యాధుడు తన కుమార్తె అర్జునకిని అతని కుమారుడు ప్రసన్నుడి కిస్తానని వచ్చిన సమయానికి.

ధర్మవ్యాధుడు మతంగుని దర్శనానికి వెళ్ళినప్పటి ఆ సన్నివేశం గురించి వరాహ పురాణంలో చదవండి. మతంగాశ్రమ వర్ణన చదివి ఆనందించండి. ఆ ఆశ్రమంలో "సరోవర తీరంబున, బహు శిష్య గణంబుల తోడ, ఆహ్నిక క్రియా కలాపంబులు తీర్చి, వేదాంతశాస్త్ర వ్యాఖ్యాన గోష్ఠి నున్న మతంగుని గనుంగొని" ఇలా అన్నాడు ధర్మవ్యాధుడు–

అనఘ స్వాంత ! మతంగ సంయమి వ
రేణ్యా ! నా తనూజాత న
ర్జునకీ కన్యక దెచ్చినాడ రమణీ
చూడామణిన్, మీ ప్రస
న్నునకున్ జేయుదమా వివాహ మిక ? ఎం
దున్ జూచినన్ కల్గ రా
యన దక్కన్ మునిరాజ నందనులు, క
న్యా దాన యోగ్యుల్, వరుల్ !

(వ.పు.ద్వి.పద్యం.119)

అర్జునీ ప్రసన్నుల ప్రేమ దాంపత్య జీవితం పార్వతీ పరమేశ్వర వైభవంగా సాగి పోయింది. అయితే-

సంసారం, సమాజం, వ్యక్తుల పెద్దరికాలు, అంతస్తు వారీ మర్యాదలు, సమర్థుల వినయాలు, అసమర్థుల అహంకారాలు వగైరా వున్నాయిగా? అవి లేకుండా సంఘ జీవిత మేముంది? అలాంటి కొన్ని సంఘటనలను ఈ నాటకంలో పొందుపరిచాను.

ఇక ధర్మవ్యాధుడి గురించి-

## ధర్మవ్యాధుడి గత జన్మలు

వసువు రాజ్యము పుత్రున కప్పగించి, వనమున కేగి, తపస్సు చేసి పుండరీకాక్ష పారస్తవము పఠించుచుండెను. అంత నీతని శరీరము నుండి, వికృత రూపుడొకడు వచ్చి, నా వలన బనిని గైకొనుమనియెను. వసువత్యాశ్చర్యము నొంది "నీ వెవ్వడవు ? ఇట్లేల వచ్చితివని" యడిగెను.

"నేను బ్రహ్మ హత్యను. నీవు క్రిందటి జన్మమున బౌంద్ర వంశమున బుట్టిన రాజువు. అపుడు జనస్థాన పురము నీ రాజధాని. నీవు వేటకు బోయి లేడియని భ్రమపడి మునిని గొట్టితివి. ఆ పాపము పోగొట్టుకొనుటకు నీవనేక పూజలు చేసితివి. వ్రతములు సల్పితివి. కాని దాన నీకు ఉదర శూల రోగము వచ్చినది. నీ మరణ

కాలమున నీ భార్యయగు నారాయణిని దలచుకొంటివి. నీవు నారాయణ నామ ముచ్చరించుటచే నిన్ను స్వర్గమునకు గొని పోవుటకు విష్ణు దూతలు వచ్చిరి. నేనడ్డు పడితిని. నన్ను వారు మోదిరి. నేనపుడు నీ శరీర రంధ్రములలో దాగి యుంటిని. నీవు స్వర్గ లోక మందున్నపుడును, బ్రహ్మ నిన్ను మరల గాశ్మీర రాజుగా బుట్టించి నపుడును, నట్లే యుంటిని. ఇపుడు నీవు 'పుండరీకాక్ష' పాఠస్తవము చేయుటచే నీ శరీరము నుండి వెడలగొట్టబడితి''నని చెప్పెను. ''నీ వలన నా పూర్వ జన్మ వృత్తాంతమును వినగల్గితిని. నీవు ధర్మవ్యాధుడవై యుండు''మని చెప్పి వసువు స్వర్గమును బొందెను. **(పూర్వ గాథాలహరి)**

ధర్మవ్యాధుడు మిథిలా నగర మందలి యొక బోయవాడు. కుల వృత్తి నెరవేర్చుచు, మాంస విక్రయము చేయుచు, సద్వర్తనుడై యుండెను. ఇతనికి బెక్కు ధర్మములు తెలిసి యుండెను. కౌశికుడను బ్రాహ్మణుడితని కడకు వచ్చి, ధర్మములు నేర్చుకొనెను. ఇతని వలన జీవ లక్షణంబులను, నహింసా లక్షణంబుల నెరింగెను.

ఇతనికి అర్జునుడు అను పుత్రుడును, అర్జునకి యను కుమార్తెయును గలరు. కుమార్తెను మతంగ ముని కుమారుడైన ప్రసన్నున కిచ్చి వివాహము చేసెను. కుమార్తె కితడు నీతులన్నియు బోధించి, యత్తవారింటికి బంపెను. ఒకనాడు అర్జునకిని నత్తగారు ''నీవు మృగములను జంపి తిను వాని కుమార్తెవు'' అని నిందించెను. ఆమెకు గోపము వచ్చి, తండ్రి యింటికి వచ్చి చెప్పెను. ధర్మవ్యాధుడు కుమార్తెను వెంట బెట్టుకొని, యత్తవారింటికి తీసికొని వెళ్ళి యామె నప్పగించెను. నేను మీ ఇంట భోజనము చేయుదును, ఏమి పెట్టుదురు అని అత్తగారి నితనుడడిగెను. గోధుమలు, కందులు, ధాన్యములు వండి పెట్టుదుమని యామె అనియె. వానిని జూడ నిండని ధర్మ వ్యాధుడు కోరగ, మతంగుని భార్య చేటలో వానిని బోసికొని వచ్చెను. అవి చూచి ''ఛీఛీ మీ యింట భోజనము చేయను. అనుదినము ఇన్ని వేల జీవరాసులను జంపెదరా ? నేను వారమున కొక్క మృగమును మాత్రము చంపి తిందును. మీ యింట గుడువ రాదని'' ధర్మవ్యాధుడు వెళ్ళబోవుచుండగా, మతంగుడు బ్రతిమాలు కొనియె. అపుడు తన కూతురును నిందించుట దోషమని వారికి దెలియునట్లుగ జెప్పెను.

ధర్మవ్యాధుడు పూర్వ జన్మమున నొక బ్రాహ్మణుడు. ధనుర్విద్య నేర్చుకొని, రాజ కుమారులతో జెలిమి చేసి, వేటకు బోవు చుండెడి వాడు. ఒకసారి వేటకు బోయినపుడు మృగమని భ్రమపడి యొక మునిని గొట్టెను. ఆ ముని యితనిని జూచి నీవు బ్రాహ్మణుడ వయ్యునూ శూద్రునట్లు వర్తించితివి. కావున మాంసము నమ్ము వాడవై పుట్టుమని శపించెను. అతడీ బోయవాడై పుట్టెను. (పూర్వగాధాలహరి).

మన పురాణాల నిండా ఇలాంటి కథలే అనేకం వున్నాయి. ఈ చండాల కులం శిక్షా కులం (పనిష్మెంటు కులం)గా వినియోగించుకోబడ్డట్టు కనిపిస్తుంది. పూర్వ కాలంలో మునులు గాని, దేవతలు గాని తమకు కష్టం కలిగించిన వాళ్ళను చండాలురు కండని శపించడం పరిపాటిగా వుండేది. పరిశీలించండి. త్రిశంకుడు అలాగే శపించబడ్డాడు. వాల్మీకిని బ్రహ్మ అలానే శపించాడు. వసువును ఒక ముని కూడ అలానే శపించాడు. గత జన్మలో ధర్మ వ్యాధుడు ఒక కథ ప్రకారం బ్రాహ్మడు, మరో కథ ప్రకారం బ్రహ్మహత్య.

నా కనిపిస్తుంది – వేద పురాణ ఇతిహాస కాలాలలో ప్రతిభావంతులు, మహా రాజులు, బ్రహ్మర్షులూ అందరూ మా వాళ్ళే అని ! మా హరిజనులే అని !

హరిశ్చంద్ర చక్రవర్తిని కొన గలిగిన భాగ్యవంతుడు ఆ కాలంలో, కాశీలో వీరబాహు ఒక్కడే. అతడు మాల మాదిగ వాడే. ఆనాడు నృత్యగాన కళలలో ఆరితేరిన వాళ్ళు మాలెతలే. విశ్వామిత్రుని పెంపుడు కుమార్తెలు, భారత జాతికి పితామహి అయిన శకుంతలకు అక్కచెల్లెండ్రు !

తన కొడుకును రక్షించుకోవడం కోసం మరొక పేదవాడి కొడుకును (శునస్సేపుణ్ని) బలి ఇవ్వడానికి సిద్ధపడ్డ స్వార్థపరుడు హరిశ్చంద్రుడు. అతడు జాత్యహంకారి కూడ. అట్టి వాణ్ని మానవతా మార్గానికి మార్చడానికి ఎంతో కృషి చేసిన వాడు విశ్వామిత్రుడు. అందుకు సృష్టికి ప్రతి సృష్టి చేయడమే కాదు, స్వర్గానికి ప్రతి స్వర్గాన్ని కూడ నిర్మించగలిగాడు. బలవంతుల దౌర్జన్యాల నుంచి బలహీనులను

రక్షించడానికి తన తపస్సు నంతా ధారపోశాడు. అందుకే ఆనాటి మహా పండితులు అతడికి విశ్వామిత్రుడు (విశ్వ+మిత్రుడు) అన్న పేరును రూఢి పరచగా, ఆ తర్వాత వైయాకరణులు దానికి విపరీతార్థం చెప్పడానికి ప్రత్యేక సూత్రాన్నే కల్పించుకోవలసి వచ్చింది.

విశ్వామిత్రుడు లేకపోతే శకుంతల లేదు. భరతుడు లేడు. భారత జాతి లేదు. అలానే అరుంధతి లేకపోతే వ్యాసుడు లేడు, కురువంశం లేదు, వేద సంస్కృతి లేదు, వేదాంతం లేదు. ఈ దేశమూ, ఈ జాతి, ఈ సంస్కృతీ యుగయుగాలుగా నేడు హరిజనులని పిలువబడుతున్న వారికి ఎంతగా ఋణపడి వున్నాయో చూడండి! వేద పురాణ సాహిత్యాన్ని పరిశీలించండి. ప్రతిభావంతుడైన ప్రతివాడూ కులం లేని వాడే కాడా ?

## హింస - అహింస

మన వేదాంతం ప్రకారం ఏది హింస ? ఏది అహింస ? చంపే వాడూ, చచ్చేవాడూ ఒక్కడే భగవంతుడు. ఎవరి స్వభావాన్ని బట్టి, అభిరుచిని బట్టి, అవసరాన్ని బట్టి వాడు ప్రవర్తిస్తాడు. స్వభావాలూ, అభిరుచులూ, అవసరాలూ భగవంతుని బహు రూపాలు. విశ్వరూపాలు. దేనికీ, ఎవరినీ నిందించ నక్కరలేదు. అభినందించక్కర లేదు. ఎవరూ దేనికీ కర్తా కాదు, కర్మా కాదు. క్రియకు బద్ధులు. క్రియ భగవత్స్వరూపం. ఈ సత్యాన్ని వెల్లడించడానికి వ్యాస మహర్షి ఎన్నుకొన్న పాత్ర ధర్మవ్యాధుడు. భగవద్గీతను ఆవిష్కరించడానికి ఎన్నుకోబడ్డ శ్రీకృష్ణు డంతటి గొప్ప పాత్ర ధర్మవ్యాధుడు.

అడవిలో వేటకు బైలుదేరి, ఒక లేడి వెంటబడి తరుముతున్న ధానుష్కుని (ధర్మ వ్యాధుని) చూచి –

"ఓయి నిషాధ కులేశ్వర !
ఏయుకు మేయకుము, జీవహింసకు నేలా
రోయవు..........?"

అంటూ ముదలకించిన ఒక బ్రాహ్మణ మునికి ధర్మవ్యాధు డిచ్చిన సమాధానం చూడండి.

అవ్వాక్యంబు నిరాకరించి, దిశల
ల్లాడన్ కఠోరంబుగా
నవ్వెన్; నవ్వి నిషాద భర్త మృగ సం
తానంబు జంపంగ నే
నెవ్వండన్, పరమాత్మ గాక ? పిస వె
ర్రీ! విప్ర ! ఈ చీకటుల్
త్రవ్వింపన్ పనిలేదు సుమ్ము మము బోం
ట్లన్ వేరు వారిం బలెన్ !

(వ.పు.ద్వి.పద్యం.18)

ఎంత అధికారంతో, రాజసంతో ఈ జవాబు చెప్పాడో చూడండి ధర్మ వ్యాధుడు!

"వీళ్ళకూ, వాళ్ళకూ చెప్పేటట్టు నీ ధర్మపన్నాలు మాకు చెప్పక్కర లేదయ్యా, వెర్రి బ్రాహ్మడా !" అన్నాడు ధర్మవ్యాధుడు. చంపేదెవరు ? చచ్చేదెవరు ? వేదాంత సూత్రాలు వల్లించడానికేనా ? ఆచరణకు పనికిరావా ? నిజమైన వేదాంతులకు, రాజయోగులకు, స్వార్థ రహితులైన ఎవరికైనా సరే భారతీయ వేదాంత ధర్మ సూత్రాలు ఆచరణ సాధ్యాలే. స్వార్థపరులకు మాత్రమే కావు.

"శిశువు మంట (మట్టితో) నెద్దు
జేయుచు జెరచుచు
నాడునట్లు పోలె, నఖిల భూత
సృష్టిదాన జేయు, చెరచు నప్పరమాత్మ"

"విశ్వ మాత్ర ప్రణీతమ్మై వికృతి బొందు,
అందులోన అహంభావ మనుచితంబు"

"శరీర గ్రహణ ధర్మంబున ఎవ్వనికి నెద్ది విహితం బక్కర్మంబు చేసి, పరమాత్మకు సమర్పించవలె" అంటూ బోధ చేశాడా బోయ !

"ఇష్టమైన పని చేసి, ఫలితాన్ని పరమాత్మకు సమర్పించి, జీవించు" అంటూ ధర్మవ్యాధుడు చేసిన ఉద్బోధ కంటే, మార్క్స్ ఎక్కువ చెప్పాడా ? మార్క్స్ చెప్పిన కేవల భౌతిక వాదం కంటె ధర్మవ్యాధుడు చెప్పిన సమిష్టి జీవన వేదాంతం సహజమూ, సుఖదమూ కాదా ?

విశ్వంలోని ప్రతి అణువూ సజీవ మైనట్టిదే అని నేడు సైన్సు నిరూపించి చూపుతుంటే ఓహో అంటున్నాం. వేల వేల సంవత్సరాల క్రితం ధర్మ వ్యాధుడు "సలిలము లుర్వి ఆకసము సర్వము జంతుమయంబు" అంటూ వక్కాణించాడే, అత డెంతటి దివ్యజ్ఞానో గమనించండి !

"కనుక, అన్ని పనుల్లోనూ హింస కలుగుతుంది. అహింస అనేది వట్టి భ్రాంతి, మాయ మాట" అన్నాడు ధర్మవ్యాధుడు.

## నిర్జీవ భోజనం

మతంగముని భార్య అత్తరికం నెరపుతూ "జీవఘాతి కూతుర!" అంటూ కోడలిని తిట్టినప్పుడు, ఎకాయెకీని మతంగాశ్రమానికి వెళ్ళాడు ధర్మవ్యాధుడు. మతంగుడు సంభ్రమంతో లేచి "కబురైనా లేకుండా ఇలా దయచేశారేమిటి?" అని అడిగాడు.

"ఏమి లేదు. మీ ఇంట్లో నిర్జీవ భోజనం చేసి పోదామని వచ్చాను" అన్నాడు వ్యాధుడు.

వాళ్ళెంతో సంతోషించి, ఇంత కాలానికి ఈ కటిక మాంసాహారికి శాకాహారంపై జిహ్వ మళ్ళిందని ఆనందపడుతూ, భోజనం తయారు చేసి, వడ్డించి పిలిచారు.

"వంట ఏమిటి చేశారు?"

"వ్రీహి, గోధుమ, యవ –"

"అవి ఏమిటి ? చూడనివ్వండి"

ఈ కటికవాడికి గోధుమలు ఎలా వుంటాయో కూడ తెలియదు, ఖర్మ – అనుకొంటూ మతంగుడి ఇల్లాలు ఒక చేటలో గోధుమలు పోసి, తెచ్చి చూపింది.

చూచి, ఉలిక్కిపడి, ఒక్క గెంతు గెంతాడు ధర్మవ్యాధుడు. అసహ్యంతో వెనక్కి పరిగెత్తాడు.

హడలిపోయిన మతంగుడు ఆయనను పట్టుకొని, అంతటి అపరాధం ఏమి జరిగిందో – క్షమింపుమని వేడుకున్నాడు.

సామాన్యమైన అపరాధమా ? క్షమించదగిన అపరాధమా?

**"అసంఖ్యములైన జీవుల ననుదినంబు**
**కనికరము లేక ప్రాణాలు గొని భుజించు**
**ఘాతుకుని ఇంట కుడు వంగ రాదు, కాన**
**తొలగి పోవుచు నున్నాడు ! కలిగెనేని**
**ప్రియమున భుజింతు, పెట్టు నిర్జీవ భుక్తి !"**

(వ.పు.ద్వి.పద్యం.145)

ఆ తర్వాతి సీస పద్యంలో ధర్మవ్యాధుడు చెప్పిన మాట ఎంతటి వజ్రాల మూటో చిత్తగించండి–

"ఒక్క అడవి జీవిని చంపి, అతిథులకు పెట్టి, పురవాసులకు పంచి, మిగిలింది నేను తింటాను. నేను చంపేది రోజుకొక్క జీవిని.

రోజుకు మూడు పూటలా ఇన్నిన్ని వేల జీవుల్ని ఉడకబెట్టి చంపి తింటున్నారే ? అమ్మో, ఎంత ఘోర పాతకులు !"

నిర్జీవ భుక్తి పెడితే తింటా నన్నాడు. జీవ రహితమైన పదార్థం ఏముంది ప్రపంచంలో?

అప్పుడు ఒక వేద రహస్యాన్ని వెల్లడించాడు ధర్మవ్యాధుడు. అది యజ్ఞ రహస్యం.

''యజ్ఞాలు అయిదు. దైవ యజ్ఞం, భౌత యజ్ఞం, పైత్ర యజ్ఞం, మానుష యజ్ఞం, బ్రహ్మ యజ్ఞం. ఈ పంచ మహాయజ్ఞాల కోసం ఓషధులను, లతలను, పశువులను సృష్టించాడు బ్రహ్మ. వ్రీహి గోధుమ పక్షి మృగాది స్థావర జంగమాన్నంబులు యజ్ఞ నిమిత్తంబు గావింపవలె. అప్పుడే అవి పవిత్రమైన వవుతాయి.''

అన్నాన్ని రెండు విధాలుగా చెప్పాడు చూడండి ! స్థావరాన్నం అంటే వరి, గోధుమ, కాయగూరలు, దుంపలు మొదలైనవి. జంగమాన్నం అంటే పశువులూ, పక్షులు, చేపలు మొదలైనవి. తినే పదార్థమంతా అన్నమే. ఏ అన్నమైనా యజ్ఞంలో పవిత్రం చేసి తినాలి. (1) దేవతా ప్రీత్యర్థం (2) భూత ప్రీత్యర్థం (3) పితృ ప్రీత్యర్థం (4) మనుష్య ప్రీత్యర్థం (5) బ్రహ్మ ప్రీత్యర్థం – ఇందులో ఎవరో ఒకరి ప్రీత్యర్థం సమర్పించుకొని (అంటే నైవేద్యం పెట్టి) ఆ తర్వాత తినాలి. అప్పుడది పవిత్రాన్న మవుతుంది.

ఈ ఆచారం ముస్లిములలో మిగిలి వుంది. ముస్లింలు ఆహారం కోసం ఏ జంతువును చంపినా ''భగవత్ ప్రీత్యర్థం'' అనే మంత్రాన్ని జపిస్తూ చంపుతారు. జంతువుల విషయంలోనే కాదు. చెట్ల నుంచి, పాదుల నుంచి కాయగూరలను తెంపినప్పుడు కూడ ఆ మంత్రాన్ని జపించాలని వేదం విధిస్తున్నది. ఈ పవిత్రాచారాన్ని ముస్లింలు పాటించడం, వేద వారసుల మనుకునే మనం వదిలెయ్యడం విచిత్రం.

అంతటితో ఆగలేదు ధర్మవ్యాధుడు. తనను జీవఘాతి అన్నందుకు మనస్సు లోని మంట ఇంకా చల్లార లేదు.

''ఎంతో వినయ విధేయతలు గల నా కూతురు జీవఘాతి కూతురైతే, మరి అంతటి పరుష వాక్కులు పలికే నీ కులకాంత, నీ ఇల్లాలు ఏ విశిష్ట పురుషుని కూతురో చెపుతావా ?'' అని ప్రశ్నించాడు. ఇక్కడ కులకాంత అనడంలో కులగర్వాన్ని ధర్మవ్యాధు డెంతగా అసహ్యించుకున్నాడో కూడ స్పష్టపడుతుంది.

"హింస చేసే నా కూతురు హింస చెయ్యని నీకు కోడలయింది. అయ్యో, పాపం! ప్రాయశ్చిత్తం చేసుకో" అంటూ హాస్యమాడాడు వియ్యంకుడితో.

బ్రాహ్మణత్వ మనేది తన కంటె భిన్నమైనదనీ, తన బైట ఎక్కడో వున్నట్టిదనీ భ్రమపడుతూ, దానికోసం తాపత్రయపడుతున్న మతంగుడికి ఈ సంఘటన ఒక కనువిప్పు.

## హరిజన

ఆ తర్వాత ధర్మవ్యాధుడు సంసార భారాన్ని కుమారుడైన అర్జునుడికి అప్పగించి, విరక్తుడై వెళ్ళిపోయాడట – ఎక్కడికి ? ఎందుకు ?

"......ముక్తి కాంత కుచ
పాళిక పజ్జల పత్ర భంగముల్
వ్రాయగ, లోహ దండ వన
వాటికి, సన్ముని రత్న పేటికిన్ !"

(వ.పు.ద్వి.పద్యం.151)

లోహదండం అనే అరణ్యానికి వెళ్ళాడట, ముక్తిని కోరి తపస్సు చేసుకోడానికి.

ధర్మవ్యాధుడి లాంటి ఒక గంభీర ధర్మ నిష్ఠాపరుడు, విరక్తుడై, తపస్సు కోసం అడవికి వెళితే – ఆ సందర్భాన్ని వర్ణించే పద్యం ఎంత శృంగార రస స్ఫోరకంగా వున్నదో గమనించండి !

ముక్తి కాంత యొక్క గుత్తమైన కుచద్వయం మీద, ఆ చుట్టు పక్కల మంచి గంధంతో అందమైన బొమ్మలు వ్రాయడానికి వెళ్ళాడట ఆయన అడవికి ! ఆ అడవి పేరు కూడ లోహదండం ! అది సన్ముని రత్నపేటిక ! ఓహో, రసధ్వని ! ఈ ధ్వని మూలకర్త వ్యాసుడిదో, తెలుగులో వ్రాసిన జంట కవులదో !

ఈ వర్ణనలో అనౌచిత్య దోషం లేదా ? లేదు – ఆ తర్వాత జరిగిన సంఘటనలను, చరిత్రలను బట్టి ఆలోచిస్తే.

హరినామం జపిస్తూ ఎంతో కాలం తపస్సు చేశాడు ధర్మవ్యాధుడు – "పాలస్థల కీలితాంజలి పుటుండై".

అప్పుడు హరి ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. ధర్మవ్యాధుడు కోరిన వరం అత్యద్భుత మైనట్టిది. విశ్వమానవ సర్వోదయ సుందర మైనట్టిది. మానవుని మరో మజిలీకి, మరో మజిలీకి చేర్చే అభ్యుదయ నిశ్రేణి అది !

ఏమిటది ?

తనకూ, తన వారసులకూ ఆత్మ విద్యా యుక్త సకల కళావత్కవిత్వం దయ చెయ్యమన్నాడు. అదీ ఆ వరం ! తన వంశంలో పుట్టిన వారందరినీ విజ్ఞాన పరులుగా చెయ్యమన్నాడు !

విజ్ఞానం అంటే నీతీ, నిజాయితీ, నిష్ఠా, నిష్కాపట్యమూ, ఇవి ఇంకా మిగిలివున్నది హరిజనులలోనే కదా !

వరం దయచేశాడు హరి. అది సరే. మరి, ఈ వరంలో స్వార్థం లేదా? వుంది. ఏం చేస్తాం ? ఆనాడు ఆ క్షణంలో అంతటి ధర్మవ్యాధుడు కూడ ఈనాటి రాజకీయ నాయకుడి లాగే ప్రవర్తించాడు. "నా వంశం, నా వారసత్వం" అనే అహంకారాన్ని వదులుకోలేక పోయాడు !

ధర్మవ్యాధుడు కోరిన వరాన్ని చిరునవ్వుతో ప్రసాదించిన హరి, ఆ వరప్రభావం వల్లనో యేమో, "ఓ, మహా కవీంద్ర ! వరములన్నియు నిచ్చితి !" అన్నాడు.

మహా+కవి+ఇంద్ర = మహాకవీంద్ర అనే బిరుద నామంతో సాక్షాత్తు శ్రీహరి నోటనే పిలిపించుకొన్న ప్రథమ మానవుడు ధర్మవ్యాధుడు.

ఈ సందర్భాన్ని గురించి నేను కొన్ని వేల పుటలు వ్రాయగలను. కాని, వ్రాత కంటె సహృదయుల ఊహ గొప్పది కదా !

యుగ కవులైన ప్రతి వాళ్ళూ ఈ ధర్మవ్యాధుడి బోయ వంశానికి చెందిన వాళ్ళే కావడం ఈ వర ప్రభావమే. పరిశీలించండి !

ఇక్కడ మరొక్క విషయం–

యజ్ఞమూర్తిని ఎలా స్తుతించాలో వివరింపుమని ఆది వరాహమూర్తిని భూదేవి అడిగినప్పుడు, ఆయన చెప్పిన స్తుతి వాక్యాలలో ఈ క్రిందివి కూడ వున్నాయి–

యజ్ఞమూర్తి ! కుభృత్సన్ని భాంగ !
యాశ !
యిజ్య ! పరమాణుతుల్య ! యో
గీంద్ర పూజ్య
హరి జనార్దన ! మూర్ధ
సహస్ర పరమ
వేద వేదాంగ ! వేదాంత
వేద్య ! నిత్య !

ఈ వాక్యాలతో "హరి జనార్దన" అనే వాక్యం వుంది, చూడండి ! హరి జనార్దన అంటే హరిజనులను పోషించే వాడా అని అర్థం. హరిజనార్దన అని విడదీయాలని కొందర నవచ్చు. ఇక్కడ హరిజన పదం ఏకపదమని నేనంటాను. పైగా, ధర్మవ్యాధుడు హరి వర ప్రసాదం పొందిన తొలి హరిజనుడు. ఇక్కడ హరిజన శబ్ద ప్రయోగం కాకతాళీయం కాదు. దైవికం.

ఇక్కడ మంత్రాల గురించి ఒక మాట–

## మహా మంత్ర మాల

నా జీవితానుభవంలో నేను కొన్ని మంత్రాలను దర్శించాను. పాత మంత్రాల స్వరూపాన్నే కాక, కొత్త మంత్రాల సృష్టిని కూడా చేశాను. ఇవన్నీ నిరంతరంగా జపించినప్పుడు ఏకాగ్రత ఏర్పడి మనస్సుకు శక్తి సామర్థ్యాలను ఇస్తాయి. ఈ మాట సర్వకాల సత్యం.

1. ఓం:– ఇది ఏకాక్షరి. నాద బ్రహ్మ. దీనిని ఆపకుండా పలకాలి. సన్నాయి ప్రక్కన శృతి లాగా, నాగస్వరం లాగా గుక్క తిప్పుకోకుండా. నాదోపాసన చాల కష్టమైన సాధన. దీనిని సాధించిన వాళ్ళే చిరంజీవులు.

2. రామా – ఇది ద్వ్యక్షరి. రెండక్షరాల మంత్రం. దీనినే తారకమంత్రం అంటారు. ఇవి రెండూ బీజాక్షరాలు. అగ్ని బీజం, కామ బీజం. ప్రకృతి పురుష సిద్ధాంతానికి

ఇది మూలం. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు అక్షర కల్పన. లోనికి పీల్చుకొనే గాలి అగ్ని, బయటకు విడిచే గాలి కామం. ఈ మంత్రాన్ని నిరంతరంగా జపించే వాళ్ళకు ప్రాణశక్తి పెరుగుతుంది. సుషుమ్న ఎదుగుతుంది. జీవ బ్రహ్మైక్యం సిద్ధిస్తుంది.

3. ఓంతత్ సత్ – ఇది త్ర్యక్షరి. తత్ అంటే బ్రహ్మ. సత్ అంటే జగత్తు. పరబ్రహ్మే ప్రకృతి. ఈ తత్ సత్ శబ్దాలను హృదయ స్పందనాలుగా కూడా అనుకోవచ్చు. ఓం అనుకొంటూ తత్సత్, తత్సత్, తత్సత్ అనుకొంటూ వుంటే సాధకుడు హృషీకేశుడే అవుతాడు.

4. ఓం ఐం హ్రీం శ్రీం – ఇది చతురక్షరి. నాలుగు బీజాక్షరాలు కలది. బ్రహ్మ, జీవం, శక్తి, ప్రకృతి. విశ్వసృష్టి క్రమవికాసం ఈ నాలుగక్షరాల మంత్రం లోనూ వుంది.

5. నమశ్శివాయ – ఇది పంచాక్షరి. అయిదు అక్షరాల మంత్రం. శివుడికి నమస్కరిస్తున్నాను అనే అర్థంతో పాటు, "నేను నేను కాదు మహాశివుణ్ణి" అనే అర్థం ఈ మంత్రంలో వుంది.

6. ఓం నమశ్శివాయ – ఇది షడక్షరి. ఆరక్షరాల మంత్రం. పంచాక్షరికి 'ఓం' చేర్చబడింది.

7. నమో నారాయణాయ – ఇది సప్తాక్షరి. నారాయణ మంత్రం. నారాయణుడు క్షీరసాగర శయనుడు. సర్వ సృష్టికి బీజప్రాయుడు.

8. ఓం నమో నారాయణాయ – ఇది అష్టాక్షరి. సప్తాక్షరికి 'ఓం' చేర్చిన మంత్రం ఇది.

ఇంకా అనేక మంత్రాలున్నై. మానవుడు సాధించాలనుకొనే శక్తులు ఎన్ని వుంటాయో, మంత్రాలు అన్నీ వుంటై. ఉపాస్య శక్తికి ప్రతీకగా వుండే దేవత పేరుతో ఆ మంత్రం వుంటుంది. ఏ మంత్రమైనా శక్తి దాయకమే. ఏ మంత్రోపాసన అయినా, దాని లక్ష్యం మనస్సుకు, శరీరానికీ, వాటి ద్వారా జీవితానికీ బలోత్సాహాలను సమకూర్చడమే. మనస్సును ఏకాగ్రం చెయ్యగలిగితే శరీరం సర్వశక్తిమంత మవుతుంది. సంకల్ప సిద్ధి స్వాధీనమవుతుంది.

ఈ మంత్రా లన్నిటికీ తల్లి అనదగింది గాయత్రి. త్రిపదా గాయత్రీ అన్నారు. ఎనిమిదేసి అక్షరాలు గల మూడు పాదాల మంత్రం. మొత్తం 24 అక్షరాలు.

9. ఓం తత్ సవిత్ు వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ఈ 24 అక్షరాలే గాయత్రి అంటే. రకరకాల సిద్ధాంతాల పండితులు, రకరకాల అక్షరాలను దీనికి ముందూ, వెనకా చేర్చి పఠిస్తారు. ఓం అనే అక్షరాన్ని భూః, భువః, స్వః అనే పదాలకు చేర్చి కలుపుతారు. అలాకాక ఓం అనేదాన్ని తత్ సవితుర్వరేణ్యం అనే మొదటి పాదానికే చేర్చాలి. అప్పుడది ఎనిమిది అక్షరాల పాదం అవుతుంది.

10. సర్వదేవ మయీం దేవీం
సర్వమంత్ర మయీం పరాం
ఆత్మానాం చింతయేత్ దేవీం
పరమానంద రూపిణీం

అంటూ సర్వమంత్రాలకూ, సర్వ దేవతలకూ మూల ధాతువైన విశ్వశక్తిని ఆరాధించారు పూర్వ ఋషులు. ఏ మంత్రాన్ని అయినా జపించినా, జపించకపోయినా ఈ శ్లోకాన్ని మాత్రం నిత్యం జపించుకొంటూ వుంటే ఆత్మబలం దానంతటదే కలుగు తుందనేది నా అనుభవం.

11. నేను రాగవైశాఖి రచన చేస్తున్నప్పుడు ఒక శ్లోకం వ్రాశాను. గ్రంథం అచ్చయిన తరువాత, దాని మీద పత్రికలలో చెలరేగిన వివాదాలతో నేను తలపట్టుకు కూర్చున్న కాలంలో సోషల్ వెల్ఫేర్ డైరెక్టరు ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీ బి.ఆర్.కె.శాస్త్రి. ఆయన ఫోనులో ఆ శ్లోకాన్ని చదివి తనకిలాంటివి వందల కొలదీ శ్లోకాలు పరిచయమేనని, బహుశా తనకి తెలియనివేవీ లేవని, అయితే ఈ శ్లోకం తనకెక్కడా కనిపించ లేదనీ, ఇది అన్ని విధాలా సమగ్ర సుందరంగా, శక్తి ప్రదాయకంగా వున్నదనీ అంటూ ఈ మంత్రాన్ని ఎక్కడ నుండి తెచ్చారు? అని ప్రశ్నించారు.

అదెక్కడా లేదనీ, కేవలం నా సొంతమనీ చెప్పాను. అయితే, సహస్రనామాల నుంచి తీసుకొన్న పదాలతో ఈ శ్లోకాన్ని కూర్చాను అన్నాను. ఆయన నన్ను గురించీ, రాగ వైశాఖిని గురించీ కొన్ని ప్రశంసా వాక్యాలు పలికి ఫోను పెట్టేశారు.

నేను నా కోసం సమకూర్చుకొన్న శ్లోకం ఇది. మంత్ర శక్తి గల శబ్ద సంపుటి ఇది. అది ఇది.

నమశ్శివాయ సాంబాయ
నటరాజాయ నమోనమః
నమశ్శివాయ సూర్యాయ
గంగాధరాయ నమోనమః
నమశ్శివాయ సోమాయ
మహా బీజాయ నమోనమః
నమశ్శివాయ భీమాయ
మృత్యుం జయాయ నమోనమః

ప్రకృతి ధర్మాన్ని అనుసరించి, హేతుబద్ధమైన కూర్పుతో, బీజాక్షరాలను అమర్చి ఈ విధంగా వందల, వేల మంత్రాలను సృష్టించుకోవచ్చు. ఏ మంత్ర శక్తి అయినా మనస్సును ఏకాగ్రం చేసి ఈప్సితాలను సఫలీకృతం చేయడానికే. ఏ మంత్ర సహాయము లేకుండానే కోరికలు తీర్చుకునే మనశ్శక్తి కలవాళ్ళు చాలమందే వుంటారు. ఏ శక్తులైనా కావలసింది బలహీన మనస్కులకే. మనోస్థైర్యం లేని వాళ్ళకు దైవ బలమూ, మంత్ర బలమూ అవసర మవుతై – వ్యాధి గ్రస్తులకు ఔషధాల వలె.

## సమగ్ర మానవుడు

మానవ మనస్తత్వం దృష్ట్యా, ధర్మవ్యాధుడు సమగ్ర మానవుడు. అతడు జ్ఞాని, విజ్ఞాని, బ్రహ్మజ్ఞాని.

మానవుడిలోని సర్వతోముఖ సర్వసమగ్ర సహజ లక్షణాలను ఏకముఖం చేసి ఒకే ఒక వ్యక్తిలో చూపడానికే వేదవ్యాసుడు ఈ పాత్రను సృష్టించా డనవచ్చు. ఈ పాత్రను

సంపూర్ణంగా ఆవిష్కరించడానికే వరాహ పురాణాన్ని వ్రాశాడేమో అనిపిస్తుంది నాకు. ఆయన వ్రాసిన పద్దెనిమిది పురాణాలలోనూ వరాహ పురాణమే మొదటిది.

విశ్వేశ్వర పరమాత్మ శ్రీ మహావిష్ణువుగా ఊహించబడిన ప్రారంభ దశలో, ఆయన ధరించిన మొదటి రూపం వరాహావతారం. కేవల భూచరాలలో వరాహం మొదటిది. అంతకు ముందు అవతారాలు రెండు జలచరాలు. శ్రీ మహావిష్ణువును తొలి రూపంలో ఆది వరాహ మూర్తిగా కీర్తించారు. ఆయన భార్యగా భూమిని ఊహించారు. భూమిని భూదేవి అన్నారు. ఆది వరాహమూర్తి భూదేవికి, సృష్టికి సంబంధించిన అనేక రహస్యాలను వివరించినట్టుగా ఈ వరాహ పురాణంలో చెప్పబడింది. వేద వ్యాసుడు ఈ పురాణాన్ని తన స్వీయ చరిత్రకు మూలంగా వ్రాసుకొన్నా డనుకుంటాను. తన వంశ వృక్షం అందరికీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నట్టిదే. వృక్షపు వేళ్ళు కనిపించవు. కనుక వాటి విషయంలో వివాదాలు తలెత్తుతాయి. అట్టి వివాదాలకు చోటు లేకుండా తానే వాటిని గురించి ఈ పురాణంలో వివరించా డనుకోవచ్చు. వేదవ్యాసుడు మాల మాదిగవాడు కాబట్టి అతన్ని గురించి కానీ, అతడి మూల పురుషులను గురించి కానీ స్మృతుల కాలం తరవాత వాళ్ళెవరూ అంతగా పట్టించుకోలేదు.

## జ్ఞాన బ్రాహ్మణం – జన్మ బ్రాహ్మణం

స్మృతుల కాలం తరువాత అన్నాను కదూ ? దీనిని గురించి కొంచెం వివరించాలి. సంస్కృతిపరంగా భారతీయతను మూడు విధాలుగా విభజించాను నేను.

(1) జాంబవ యుగం. జంబూ ద్వీపాన్ని ఏకరాజ్యంగా ఆది భారతీయులు పరిపాలించిన యుగం.

(2) జంబూద్వీపం భరత వర్షం, భరత ఖండంగా కుంచించుకు పోతూ వచ్చిన భారతయుగం ఇది. మేనక మనుమడు భరతుడు పాలించిన కాలం. ఈ రెండు యుగాలూ వేదకాలం నాటివే. సిసలైన భారతీయత తోడివే. వర్ణ వ్యవస్థ అమలులో వున్నప్పటికీ, అది గుణ కర్మలను బట్టీ, వృత్తులను బట్టీ మారుతూ వచ్చేది. ఎక్కడ

ఎలా పుట్టాడనే వాస్తవం మీద కాక వ్యక్తి సాధించిన జ్ఞానాన్ని బట్టీ, ప్రజ్ఞలను బట్టీ వర్ణాలు మారుతూ వచ్చేవి. గుహుడు, హిరణ్య ధన్యుడు, దాసరాజు వంటి స్వదేశీయ మహావీరు లెందరో దేశాన్ని పాలించిన కాలమది.

అదంతా మాసిపోయిన తర్వాత, విదేశీ దండ యాత్రలతో దేశం చెక్కముక్కలై పోయిన మూడో యుగం. స్మృతుల యుగం ప్రారంభమైంది. సిరియనులు, అస్సీరియనులు ఈ దేశం పైకి వచ్చి మధ్యప్రాచ్యం లోని తమ స్పర్ధలను ఈ దేశంలో సురాసుర యుద్ధాలుగా కొనసాగించిన యుగం అది. సురాసుర యుద్ధాలే దేవాసుర యుద్ధాలుగా పేర్కొనబడ్డాయి. ఆ ఉభయ పక్షాలకూ కూడా హీబ్రూలు (యాదులు) వచ్చార నవచ్చు. దేవతల గురువు బృహస్పతి, రాక్షసుల గురువు శుక్రాచార్యులు హీబ్రూ మేధావులే. (The Hebrew origin of the Indian Brahmin అనే ఆంగ్ల గ్రంథం చూడండి).

అంతవరకూ వున్న భారతీయ బ్రాహ్మణత్వం స్థానాన్ని ఈ హీబ్రూ బ్రాహ్మణత్వం ఆక్రమించుకుని స్మృతులు, ధర్మ శాస్త్రాలు సృష్టించి ఈనాటి అధోగతికి దేశాన్ని దిగజార్చాయని నేను భావిస్తున్నాను. అందుకే వ్యాసుడి వరకూ జరిగిన సాహిత్య సృష్టిలో పేర్కొనబడ్డ బ్రాహ్మణత్వం వేరు. ఈనాడు అమలులో వున్న బ్రాహ్మణత్వం వేరు. అది జ్ఞాన బ్రాహ్మణత్వం. ఇది జన్మ బ్రాహ్మణత్వం. నేను బలపరుస్తున్నది జ్ఞాన బ్రాహ్మణత్వాన్నే.

## కర్మ నిజస్వరూపం

కర్మను గురించి సాధికారంగా చెప్పగలిగినవాడు ధర్మవ్యాధు డొక్కడే. హింస, అహింస మొదలైన కర్మలకు బాధ్యత ఆయా వ్యక్తులు కాదని ధర్మ వ్యాధుడు సిద్ధాంతీకరించాడు. 'మును తను చేసిన కర్మంబున' అనే ధర్మవ్యాధుని మాటకు అర్థం గతంలో తాను చేసేన పనికి అనే అర్థం. గత జన్మలో అని కాదు.

''చంపెడు వాడు నిమిత్త మాత్రుడు'' అంటే – ఏ వ్యక్తి అయినా తన అవసరానికి తగినట్టే ఏ పనైనా చేస్తాడు అని అర్థం. పిల్లి ఎలకను చంపుతుంది. పులి లేడిని

చంపుతుంది. అవి తమ ఆహారం కోసం చంపుతాయి కనుక వాటికి హత్యాదోషం వుండదు. మనిషి కూడా అవసరం లేకుండా ఎవ్వరినీ చంపడు. ఏ పనిచేసినా ఏదో అవసరం వుండే చేస్తాడు. కనుక క్రియ, కర్త యొక్క అవసరాన్ని బట్టి జరుగుతుంది అనేది ధర్మవ్యాధుడి సిద్ధాంతం.

ధర్మవ్యాధుడి కొడుకు అర్జునకుడు మృత్యువును, కాల పురుషుడ్నీ, కూడా శాసించ గలిగిన సందర్భంలో కూడా ఈ విధంగానే అర్థం చెప్పుకోవాలి. అవగాహన చేసుకోవాలి.

## అంకితం గురించి

ముద్రించబడిన నా ప్రతి గ్రంథమూ ఎవరో ఒక ఆత్మీయుడికో, ఆత్మీయు రాలికో అంకితం ఇవ్వబడినట్టిదే. అంకితం ఇవ్వడానికి ప్రధాన అర్హత ఆత్మీయత.

ఇప్పటి వరకు నా గ్రంథాలను అంకితం పొందిన వారందరూ నా ఆత్మీయులే. నేను ఆత్మీయులుగా భావించుకొనే వాళ్ళు. తమకు నేను ఆత్మీయుణ్ణో, కాదో అనే విషయం నేను పట్టించుకోను. వాళ్ళలో కొందరు నన్ను ఆత్మీయుడుగా భావించలేదనే వాస్తవాన్ని నేను ఆ తర్వాత గుర్తించాను. అందుకు నేను బాధ్యుణ్ణి కాదు కనుక, అదీ నేను పట్టించు కోలేదు.

నా ఆత్మీయతే నాకు ముఖ్యం. అది నిత్య సత్యం. నిరంతర ప్రణయ ప్రవంతి.

నేను అంకితా లిచ్చిన వారందరూ తెలుగు వెలుగులే. సమాజంలో అగ్రశ్రేణిలో ధీమహితులే. నా అంకితాలపై ఎవరైనా పరిశోధన చేస్తే రెండు మూడు డాక్టరేట్లయినా పొందవచ్చు. అంతటి ఉన్నత చరిత్రలున్నై వాటికి.

నా గ్రంథాలను అంకితం తీసుకొన్న వారిలో ఇంతవరకు ముగ్గురు మహిళామణు లున్నారు. అందులో ఒకరు ప్రభ. రెండవ వారు నన్ను అన్నయ్యగా దత్తత చేసుకొన్న డాక్టర్ ఆది లక్ష్మి. ఆంగ్ల రచయిత ఆంజనేయులు గారి సతీమణి. మూడవ వారు మా చెల్లెలు ద్రౌపది. అంబేడ్కర సుప్రభాత కావ్యం ఆమెకు అంకితం.

ఇప్పుడు ఈ ధర్మవ్యాధుడు కావ్యాన్ని అంకితం తీసుకుంటున్న డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి గారు నాలుగో మహిళ. నా ఆత్మీయుల్లో మహా మనీషి. సారస్వత మహి మాన్విత.

రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారి రాజసంతో ప్రసిద్ధికెక్కిన వంశం వాసిరెడ్డి. ఆ వంశంలో గుంటూరు జిల్లా చేబ్రోలులో, రంగనాయకమ్మ, రాఘవయ్య దంపతులకు ఉదయ రవి చంద్రిక వలె ఉదయించిన బ్రాహ్మీమూర్తి సీతాదేవి. నవ రసాత్మక సారస్వత కేదారేశ్వరిగా పల్లీ పట్టణ ప్రజానీకంతో కలిసి మెలిసి, పెరిగి పెద్దదైన సీతాదేవి సహజంగానే కథా కోరకాలనూ, నవలా మందారాలనూ వాసిగల రాశులుగా వెలయిస్తూ ప్రఖ్యాతి లోకి వచ్చింది.

సీతాదేవి గారి మొదటి కథ మద్రాసులో పందిరి మల్లికార్జున రావు గారి కిన్నెర పత్రికలో మొలకెత్తింది. ఆ పందిరి సామాన్యమైంది కాదు కదా ! అది వాంగ్మయాకాశ మంతటా విస్తరించి, దశ దిశలా గుబాళించింది. మట్టి మనిషి, మరీచిక, ఆమె కథ, ఉరిత్రాడు వంటి నవలలుగా, నవరస పూర్ణ కలశాలుగా సీతాదేవి గారికి సారస్వత రాజదర్బారులో రత్న కిరీటాలు పెట్టినై. సన్మానాలకూ, సత్కారాలకూ, పరిమితులే లేవు. గౌరవ మర్యాదలు అపార పరంపరలైనై.

సీతాదేవి గారితో నా పరిచయం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలిరోజులలో, రాజధాని భాగ్యనగరు లోనే. వృత్తి రీత్యా మహిళా సంక్షేమ శాఖలో ప్రవేశించి, పదవీ సమున్నతిని పొందుతూ, జవహర్ బాలభవన్ డైరక్టరుగా అగ్రశ్రేణిపై అలరారిన ప్రతిభావంతురాలు, ప్రజ్ఞా ధీమంతురాలు సీతాదేవి.

అట్టి సారస్వతాత్మకు ఈ నా ధర్మవ్యాధుడు దృశ్యకావ్యాన్ని అంకితం ఇస్తున్నందుకు ఆనందంగా వుంది. అమందానందంగా వుంది.

# కృతజ్ఞతలు

ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు అనే రెండు నాటకాలను నేను ఏభై ఏళ్ళ క్రితమే వ్రాసాను. ఆ రెంటినీ ఒకేసారి ముద్రించి ప్రకటించాలనే ఉద్దేశ్యం తోనే ఇన్నేళ్ళూ గడిపాను.

ధర్మవ్యాధుడి పట్ల నాకు ప్రీతి మెండు. అతడు నాటకంలో ఇమడడం లేదని నవలగా వ్రాద్దామనుకొన్నాను. అది కష్టతరం కాగా, చేతి శక్తీ, కంటి చూపూ తగ్గుతూ రాగా, టేపు రికార్డరు కొనుక్కొని, పద్యాలలో కావ్యంగా పాడసాగాను. అదీ తుద ముట్టదని గ్రహించి ఇప్పుడు ఆ తొలి రూపం లోనే నాటకంగా ప్రకటిస్తున్నాను.

ఈ కృషి పరంపరలో, వివిధ దశలలో నాకు చేదోడు వాదోడుగా నిలిచిన సన్నిహితులు, ఆత్మీయులు అందరికీ నే కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ముఖ్యంగా మా ఆవిడ హైమవతికి, మా అమ్మాయిలు విజయపల్లవీ, విజయేందిరలకు, మా అబ్బాయి లాంటి ఐ.ఏ.ఎస్ ఆఫీసరు బంకా సుధాకర్‌రావుకు, అంకితం తీసుకుంటున్న వాసిరెడ్డి సీతాదేవి గారికి, నిత్య సన్నిహితులుగా సహాయ సహకారాలు అందిస్తూ వుండే జస్టిస్ పున్నయ్య గారికి, ఆర్య సోమయాజుల సావిత్రి గారికి నేను తీర్చుకోలేనంత పెద్దగా రుణపడి వున్నాను. కృతజ్ఞతలు మామూలు మాట.

అందంగా పేజీలు అమర్చిన ఎల్.కె. డిటిపి. సెంటర్ శ్రీ పైడిముక్కల కృష్ణగారికి, పుస్తకాలుగా అందించిన శ్రీకళా ప్రెస్సు వారికి, ఈ కార్యక్రమంలో సహాయపడిన పొన్నాడ రవిచంద్ర గారికీ కృతజ్ఞతలంటే చాలవు. నేను ఏ సహాయ మడిగినా కాదనకుండా అందజేసే పద్మభూషణ సినారె గారికీ, రసమయి రాము గారికీ పోతుకూచి వారికీ సర్వదా నతమస్తకుణ్ణి. చిత్ర శిల్పి పాలాల రాధాకృష్ణరాజు గారికి కృతాంజలుణ్ణి.

-బోయి భీమన్న

భాగ్యనగరం

19-9-1999

❋ ❋ ❋

## కృతి సమర్పణ

నవలా సారస్వతి సరస్వతీ మూర్తి

# వాసిరెడ్డి సీతాదేవి గారికి

వాసిరెడ్డి సీతాదేవి వాసి విరిసి
రాశులుగ పూచె వాఙ్మయాకాశ మెల్ల
నలలా అవి? అమృత పూర్ణ కలశాలు !
అట్టి ఆ యమ్మకు ఈ కృతి అంకితమ్ము

తీయని రాగ వీచికలు
తేల్చిన మత్కృతి రత్నమాల లా
త్మీయుల కంకితమ్ములు సు
మేరువు లవ్వి మదీయ ధీమహిన్ ;
ఈయ దలంచి నాడ, ఇపు
డిచ్చుచు నుంటిని వాసిరెడ్డి వం
శీయ మహా మనీషికి, వ
శీకృత వాణికి మత్కృతీశ్వరిన్

డాక్టరంబేద్కరుకు సెక్రటరీగ ఒకరు
ఆంధ్ర విశ్వ విద్యాలయాధ్యక్షులొకరు
గౌరవించిరి నన్ను; తత్ మేరు వంశ
వీరనారి సీతాదేవి, వీరవాణి !

ప్రాణసఖి ధాత్రికి ఆది వరాహమూర్తి
వినిచిన పురాణ మీ సనాతన చరిత్ర
వ్యాస కథనము దృశ్య కావ్యముగ మలచి
విశ్వమంతకు చూపింతు వేద విధులు !

అమృత జీవన సారస్వతమున గలిపి
అర్థులకు, ఆప్తులకును సహాయ మొసగు
రాజసము వాసిరెడ్డి ధర్మాన నమ్మ
అది మదక్షర వత్సలా హృదయవాసి!

స్వర్ణ కంకణమున సర్వార్థములు నింపి
సర్వ పాత్రలందు సమత నింపి
విందు చేయు చాంద్ర విద్య సీతా దేవి
ధర్మ కృతి కిరీట ధాత్రి నేడు !

హేతువాత్వము, మానవతా
జాతీత్వము ఉభయ శక్తి సాహిత్యముగా
సీతా దేవి రచించుత
చాతుర్ముఖ బ్రహ్మ నుదుట సమతా క్షరముల్ !

– భీమన్న

❋ ❋ ❋

# ధర్మవ్యాధుడు

## అంకం ఒకటి

(ఎటు చూచినా కీకారణ్యం. రకరకాల అరుపులతో, ధ్వనులతో భయంకరంగా వుంటుంది. నడుమ ఒక ఇరుకైన మార్గం. ఋషి రూపంలో వున్న ఒక యువకుడు రంగంలో ప్రవేశిస్తాడు. పాతికేళ్ళ లోపువాడు. స్ఫురద్రూపి. బూడిదరంగు తెలుపు. ఎత్తరి. చేతిలో ఒక దొనికర్ర. కర్రకు తగిలించి భుజం మీద నుంచి వేలాడుతున్న ఒక చిన్న సంచి. ఏ ప్రయాణికుడికైనా ఇది సాధారణ వేషం. గడ్డం పెరిగి వుంది. సిగ ముడివేసి వుంది. అతడు నిజంగా ఋషి కుమారుడే. చాల దూరం నుండి నడిచి వస్తున్నట్టుగా వున్నాడు. పడమటి నుంచి తూర్పుగా పోతున్నదా మార్గం. అతడు కొంచెం విశ్రమించడానికి తగు నీడ కోసం చూస్తున్నాడు. అతడి వివరాలను కొంచెం కొంచెంగా నేపథ్య వాణి చెపుతూ వుంటుంది. నేపథ్యవాణికి అనుగుణంగా కౌశికుడు కదులుతూ వుంటాడు.)

కౌశికుడు

**ఓం తత్ సవితృ వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి.**
**ధియో యో నః ప్రచోదయాత్**

(అతడు గాయత్రీ మంత్రం పఠిస్తూ రంగంలో ప్రవేశించాడు.)

నేపథ్యవాణి

అతడొక మార్గస్థుడు. తపస్వి. చాల దూరం నుంచి వస్తున్నాడు. అలసి వున్నాడు. విశ్రమించడానికి తగు స్థలం కోసం వెతుక్కుంటున్నాడు. గాయత్రీ మంత్ర పఠనం అతడి నిత్య నిరంతర జీవిత చర్య. దానిని అతడు పట్టి పలుకడు. దానికదే పలుకుతూ వుంటుంది.

పశ్చిమము నుండి తూర్పుకు పందుకొన్న
హిమగిరీంద్రుని పాదాలు హేమగిరులు ;
అవియె కేంద్రము భువికి, కాశ్యపికి; కాశ్య
పుని సుతులు పంచుకొని దాని ననుభవింత్రు !

జంబూ ద్వీపం పేరు భరత వర్షం. భరత ఖండంగా మారి ఎంతో కాలం కానందువల్ల మధ్యధరా సముద్రం నుంచి తూర్పున అరుణాచల ప్రాంతం వరకు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలు ఒకటిగానే వున్నాయి. హిమాలయ పర్వత పంక్తులకు ఉత్తర దక్షిణాలలో వున్న వివిధ దేశాలను కశ్యప సంతానమైన ఆదిత్యులు, దైత్యులు, దేవతలు, దానవులు, మానవులు, యక్ష గంధర్వాదులు ఆక్రమించుకొని పరిపాలిస్తూ వున్నారు. కౌశికుడు ఎక్కడినుంచి వస్తున్నాడో మన కక్కరలేదు. కాని గమ్యం మాత్రం మిథిలానగరం. మిథిలానగరాన్ని పరిపాలించే మహారాజు బిరుదనామం జనకుడు. అతడు రాజర్షి. మహర్షులకు, మహా గురువులకూ కూడా ఆధ్యాత్మిక విద్యా రహస్యాలను వివరించగలవాడు లోకంలో జనక రాజర్షి ఒక్కడే.

కాళ్ళు ముందుకు, స్మృతులు వెన్కకును నడువ
చెట్ల చీకటి లోకి కౌశికుడు చేరె !
విశ్రమించుటకై చోటు వెదకు కొనుచు
ఆలకించెను దూరాన అలికిడేదో !

అలికిడిని లెక్క చేయకుండా కౌశికుడు ముందుకు నడిచాడు. ఇంతకూ అతడు

గురుకులము పూర్తి చేసిన కూర్మిసుతుడు
గేస్తు కావచ్చు తపమున కేగవచ్చు,
అనుభవ జ్ఞాన యాత్రల కరుగవచ్చు.
వయసు వచ్చిన వాని నాపగల రెవరు ?
రెక్కలు వచ్చిన పక్షిని
అక్కడనే ఉండమనుట అసహజము; మనుజుం

దొక్కడె తిని నిద్రించును,
తక్కిన ప్రాణులు చరించు తత్ క్రియలన్ !
కష్టసుఖములు కర్మ సంగతులు కనుక
ఒకని కర్మను మరియొక దుడుపలేడు ;
తనయు డెవ్వడు ? ఎవ్వడు తండ్రి ? ముక్తి
యాత్రలో రెండు వేర్వేరు ఆత్మలివ్వి.
పితరులకు కౌశికుం డిట్లు హితము చెప్పి,
పయన మయ్యెను తన ముక్తి పథము వెంట ;

తల్లిదండ్రులు తమ వద్దనే వుండిపొమ్మని ఎంత చెప్పినా వినకుండా, కౌశికుడు బయలుదేరి పోయాడు. అతడు చేసిన పనిలో అధర్మమేమీ లేదు. పెద్దవాళ్ళైన పిల్లలను వాళ్ళ గతికి వాళ్ళను వదిలి వేయడమే తల్లి తండ్రుల ధర్మం.

తల్లితండ్రుల పట్ల బాధ్యతలు తీరు
ఆత్మజులు, తామె తల్లిదండ్రులైన పిదప
తాము ముదిమిలో సుఖపడ దలతు రేని
కాచి పెట్టుకో వలయును తగు ధనములు !

తమ సంతానం పట్ల తల్లితండ్రుల కుండే వ్యామోహం ఒక్క మానవుల లోనే వుంది. తక్కిన ఏ జీవ వర్గం లోనూ లేదు. భారతీయులలోని కర్మ సిద్ధాంతానికి, "అపుత్రస్య గతిర్నాస్తి" అనే సూత్రానికీ ఏ సంబంధమూ లేదు. పైగా రెండు పరస్పర విరుద్ధాలు - (చెట్ల మీద ఏదో అలికిడై కౌశికుడు పైకి చూశాడు. తన తల మీద నుంచి ఒక బాణం రివ్వున పోగా, ఉలిక్కిపడి కిందకి వంగాడు.)

నేపథ్య వాణి

రివ్వున దూసుక పోయెను
ఎవ్వరి బాణమ్మొ ? చచ్చి ఇలపై కూలెన్

ముప్పన్నెల పులి ఒక్కటి ;
ఇవ్వనమొక మృత్యు ముఖమె ఎటు కనుగొన్నన్ !

(చచ్చిపడిన చిరుతపులిని తిరిగి తిరిగి చూస్తూ, తల తడుము కుంటూ బెదరిన కౌశికుడు వడివడిగా ముందుకి నడిచాడు.)

నేపధ్య వాణి

తండ్రి పోషణమున తాను తగిలియుండ
తన తనూజల నెవడు పోషణము చేయు?
ముసలివారికి ప్రత్యేక వసతి గృహము
లుండవలె, పోషకుడుగ రాజుండ వలెను !

భూమి నేలెడు వాడైన రాముడైన
తీయగల్గును ప్రాణాలు ఈయలేడు !
ప్రాణములు మూడు తలల సర్పములు, వేయి
తలల కర్మకు దాసాను దాసులవ్వి !

దుర్గమ మగు మార్గములో
స్వర్గమే ముందుండి నడుపు సర్వాధ్వకులన్ !
దుర్గా వరధామమె కుల
వర్గాదులు లేవు మిథిల బలమెంతటిదో !

(కౌశికుడు నిష్క్రమిస్తూ వుండగా – తెర)

# ధర్మవ్యాధుడు

## అంకం రెండు

(మిథిలా నగరం పొలిమేరల్లో ఒక మహారణ్యం. అరణ్య మధ్య భాగం. పారిపోతున్న ఒక అడవి పందిని తరుము కొంటూ, ముందు అర్జునకీ, కొంచెం తర్వాత అర్జునుడూ, ఎక్కుపెట్టిన బాణాలతో ప్రవేశిస్తారు. వేట దుస్తులలో వున్నారు. వయస్సులు - అర్జునుడు పాతిక లోపు. అర్జునకి ఇరవై లోపు. పంది పోయిన దిక్కుకేసే పరికించి పరికించి చూస్తూ నిలబడ్డారు)

అర్జునకి

అన్నా అదిగో, చూడు !

కర్షకుల కష్ట ఫలమెల్ల కడుపు నిండ
మెక్కి బలిసిన ఈ పంది చిక్కకుండె !
పరుగు తీసిన దటు మునిపల్లె కేసి !
అమ్ము విడిచిన ఏ బ్రహ్మ హత్య యగునొ !

ఇప్పు డేమిటి చెయ్యడం ? (అన్నగారి ముఖంలోకి చూస్తుంది)

అర్జునుడు

ప్రజల నోళ్ళు కొట్టి, దొంగ తిళ్ళు తింటున్న పందులు కూడ మహామునుల ఆశ్రమాల వెనుక రక్షణ పొందుతున్నై.

(అటుకేసి పరికించి చూస్తూ)

చెల్లీ ! మనం చాల దూరం వచ్చేసినట్టున్నాం ! అదిగో అది మతంగ మహర్షుల వారి ఆశ్రమ వాటికలా వుంది ! ఆయన మరీ భయంకరుడు !

బ్రాహ్మణత్వము కొరకు తపమ్ము మీద
తపము చేయుచు నున్న సంతప్తు డతడు ;
దుష్ట సాంఘిక నీతి సందష్టు డగుట
కుమిలి పోవుచునున్న ముక్కోపి అతడు !

అర్జునకి

అన్నా ! ఎప్పటి నుంచో అడగాలనుకొంటున్నాను. ఈ మతంగులది మన జాతేనట కదా ? నాన్న అంటుంటే విన్నాను. మరి, బ్రాహ్మణుడు కావాలన్న అంత తపన ఎందుకు? కోపం ఎవరి మీద ?

అర్జునుడు

చెల్లీ ! నీ కదంతా చెప్పేలోగా, పంది కాస్తా జారుకొంటుంది. ఈ సమయంలో మనం దాన్ని కొట్టకపోతే, రెండు విధాలుగా మనం నష్టపోతాం. చూడు.

పంది నీ నాడె కొట్టి మీ పంట నిల్పు
వారమని చెప్పితిమి మనవారికెల్ల !
మన దుకాణమ్మునకు పంది మాంసమెంతొ
విలువ నీయదె? నాన్నయు వేడ్క పడడె ?

అర్జునకి

(అతని మాట వింటూ కూడ, దృష్టి పంది పోయిన దిక్కు కేసే నిలిపివుంచి) అయితే – అన్నా ! ఇదిగో, నీ రెండు కోర్కెలకూ సాఫల్యం ! (బాణం లాగి విడుస్తుంది)

(బాణం వెళ్ళిన దిక్కు నుంచి కాక, రెండో వైపు నుంచి "అయ్యో" అనే ఆర్తనాదం వినిపిస్తుంది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూస్తారిద్దరూ. భయం భయంగా ఒకర్నొకరు చూచుకుంటారు. అంతలో ఆ ప్రక్క నుంచి పెద్దగా రోదిస్తూ, గౌతమి రంగంలోకి ఉరుకుతుంది.)

గౌతమి

(మహా భయంకరంగా) పాము ! అయ్యో, పాము ! బాబోయ్, పాము ! నా బిడ్డను కరిచేసిందిరా, భగవంతుడా ! అయ్యో, బిడ్డా ! అయ్యో, నాయనా ! (గుండెలు బాదుకొంటూ తిరిగి పరిగెడుతుంది)

అర్జునకి

(ఉలిక్కిపడి) అదిగో ! అదిగో ! అదిగో ! అన్నా ! అదుగో ఆ సర్పం ! అటు పోతోంది !

అర్జునుడు

(అటు చూచి) ఆహా ! కాటేసి కనపడకుండా పోతున్నదిగా ! చూస్తా దాని సంగతి !

సర్పవాక్కు

(లోనుంచి) కాటేసి కనపడకుండా పోవడానికి నేనేం మానవాధముణ్ని కాదురా, కుర్రా ! నేను చెయ్యదలచిన పని బహిరంగంగానే చేసి నిలబడ్డా నిక్కడ.

అర్జునుడు

ఎంత అహంకారం ! (దురుసుగా లోపలికి వెళతాడు. గౌతమి రంగంలోకి వస్తుంది)

గౌతమి

అయ్యో , నాయనా ! నన్నైనా కరిచింది కాదేంరా ? ఎంత పాపిష్టిదాన్నే, తల్లీ ! (అర్జునకి ముందు కూలబడుతుంది)

అర్జునకి

(ఆమె లేవ నెత్తుతూ) అమ్మా ! ఆపుకో, అమ్మా ! నీ బిడ్డ బ్రతకడానికి చెయ్యగలిగిం దంతా చేస్తాం.

గౌతమి

ఏం చేస్తారే ? తల్లీ ! ఆ రకం సర్పం కరిస్తే, ఇంకా బ్రతకడమేనా? అయిపోయింది. నా బ్రతుకు వ్యర్థమైపోయిందే, తల్లీ !

(అంతలో సర్పాన్ని పట్టుకొని అర్జునుడు ప్రవేశిస్తాడు.)

అర్జునుడు

(తీవ్రంగా) సర్పరాజా ! ఈ బాలుణ్ని మనం బ్రతికించక తప్పదు. ఇతడి రక్తంలో నీవు ప్రవేశపెట్టిన విషాన్ని ఉపసంహరించుకో. ఊ ! త్వరగా !

సర్పం

సాధ్యం కాదు.

అర్జునుడు

ఎందుకు సాధ్యం కాదు? నూరేళ్ళు బ్రతకవలసిన వాణ్ని బాల్యంలోనే చంపెయ్యడం సాధ్యమయిందా నీకు ?

సర్పం

ఏ జీవి జీవన్మరణాలూ నా అధీనంలో లేవు.

అర్జునుడు

చంపడం నీ అధీనంలో వుండి, బ్రతికించడం లేదా ? నీ రాజకీయం నా దగ్గర సాగదు. నేను చెప్పినట్టు చెయ్యి ! చెయ్యవో ? తలకాయ చితగ్గొట్టి నిన్ను చంపేస్తా !

సర్పం

నన్ను చంపితే, ఈ బాలుడు బ్రతుకుతా దంటావా ?

అర్జునుడు

అందుకే, విషం ఉపసంహరించుకోమంటున్నాను.

సర్పం

సాధ్యం కాదు.

అర్జునుడు

నిన్ను చంపేస్తున్నాను.

సర్పం

అప్పుడు రెండు హత్యలవుతాయి. నేను చేసిం దొకటి. నీవు చేసిం దొకటి. నాకు హత్యా దోషం లేదు. నీ కుంది.

అర్జునుడు

నీకెందుకు లేదు ?

సర్పం

నేను మృత్యువు బంటును. స్వతంత్రుణ్ని కాదు. నా ప్రతి కర్మ వెనకా అతడి ఆనతి వుంది.

అర్జునుడు

అయితే – ఆ మృత్యువునే చంపుతాను. మృత్యువు ఎక్కడ ? (నిశ్శబ్దం)

అర్జునుడు

(కోపంగా) నా నుంచి తప్పించుకోలేవు. మృత్యుదేవా ! రావయ్యా వెలుగులోకి !

(వికటంగా నవ్వుతూ మృత్యువు ప్రవేశిస్తాడు. ఛాయా రూపంలో కాని, బురఖాలో కాని మృత్యు రూపాన్ని చూపవచ్చు.)

మృత్యువు

ఎందుకు పిల్చావ్ ?

అర్జునుడు

నిన్ను చంపడానికి. మృత్యువుని చంపి, జీవికి అమరత్వం ఇస్తాను. బాల హత్యలు, బ్రహ్మ హత్యలు చేసే నిన్ను (ఒర నుంచి ఖడ్గం దూస్తాడు.)

మృత్యువు

(భీకరంగా నవ్వి) నీ యంత మూర్ఖుణ్ని నేనెక్కడా చూడలేదు. బ్రాహ్మణాది వర్ణ భేదాలు మీలో మీరు కల్పించుకొన్నట్టివి. వాటితో మాకు పని లేదు. మాకు సర్వప్రాణులూ సమానమే. వర్ణ వర్గ వయో భేదాలను పెద్దపులి లాంటి జంతువే పాటించదే.

సర్పం

నేనూ పాటించను

(అంత వరకు సర్పం తన చేతి లోనే వుండడం గుర్తించి, అర్జునుడు దాన్ని విసిరేస్తాడు.)

మృత్యువు

సర్పం నా బంటు. నేను మహాకాలుడి బంటును.

అర్జునుడు

అతడెవరు ? ఎక్కడుంటాడు ?

మృత్యువు

సృష్టి స్థితి లయాలను సమతూకంలో నడిపించే శాఖకు అధ్యక్షుడు మహాకాలుడు. మేమంతా శక్తివంతమైన రాజ్యంలో సమర్థులైన చారులవలె అంతటా వుంటాం, అన్ని రూపాల్లోనూ వుంటాం. అవసరమైతే తప్ప ఏ పనిలోనూ జోక్యం కల్పించుకోం.

అర్జునుడు

(అక్కడున్న అందరి వంకా ఒకసారి చూచి, కళ్ళు మూసుకొని చేతులు మోడ్చి)

**ఓ మహా కాలుడా ! జీవయోగ మూర్తి !**

**సాధు రక్షణ చేయ సాక్షాత్కరింపు !**

**ఈ అకాల అకారణ మృత్యు భటులు**

**ధర్మ విధులో, కిరాయి హంతకులో, చూడు !**

(ఛాయగానో, బురఖా లోనో మహాకాలుడు రంగంలో ప్రవేశిస్తాడు. ఆకారం ఉన్నతమూ, ఉజ్వలమూ. అతడి సాక్షాత్కారంతో మృత్యువు మాయమైనాడు. మహాకాలుడికి అందరూ భక్తితో అంజలి ఘటిస్తారు.)

మహాకాలుడు

ఈ బాలుడి మరణానికి బాధ్యత నాది కూడ కాదు. అది అతడి కర్మది. సర్పం, మృత్యువు, నేను – అందరమూ నిమిత్త మాత్రులమే. అతణ్ని కరిచింది అతడి కర్మే.

అర్జునుడు

(ఆశ్చర్యంతో చూస్తూ) కర్మ అంటే ఏమిటి మహాత్మా ? అందరి నోటా చిలుక పలుకులా వెలువడే ఈ కర్మ అనే దానికి నిజంగా ఒక స్థితి అంటూ వున్నదా ? లేక మీ మీ స్వప్రయోజనాలకు దైవత్వం కల్పించే ఒక సాకు మాత్రమా ?

మహాకాలుడు

కర్మ స్థితి గతులను గురించి నాకూ తెలియదు. నేను కర్మ బద్ధుణ్నే. కర్మను గురించి తెలిసినవాడు, చెప్పగలవాడు మీ జనకుడు ధర్మవ్యాధు డొక్కడే.

అర్జునకి

(ముందుకు వచ్చి) స్వామీ ! మీ దివ్య దర్శనం కూడా ఈ అభాగ్య బ్రాహ్మణికి పుత్ర భిక్ష పెట్టజాలదా ?

మహాకాలుడు

బిడ్డా ! ఆమె వేరు. అతడు వేరు. బ్రతికి వున్న వాళ్ళకే బాంధవ్యాలు. చచ్చిన వాళ్ళకుండవు. బంధు భ్రాంతీ, హృదయ దౌర్బల్యమూ బ్రతికివున్న వాళ్ళను దుఃఖంలో ముంచుతున్నై. వాళ్ళను రక్షించగల దొక్క జ్ఞానమే. తన కొడుకు బ్రతకాలని తల్లి కోరుకొంటున్నది. తాను తిరిగి బ్రతకాలని ఆ కొడుకు కోరుకోవడం లేదు. అదిగో, అతన్నే అడగండి చెపుతాడు !

(కాలుడు అదృశ్యమవుతాడు. అంతవరకు శవ రూపంలో పడి వున్న బాలుడు లేచి కూర్చుంటాడు. గౌతమి "బ్రతికావా బిడ్డా" అంటూ అతణ్ని సమీపిస్తుంది. బాలుడు కోపంతో అరుస్తాడు)

బాలుడు

ముట్టుకోకు ! ఎవరు నీవు ? తల్లివా ? ఎవరి తల్లివి ? ఎప్పటి తల్లివి? అయ్యో ! మళ్ళీ ఈ జన్మ నరక మేమిటి నాకు ? ప్రభూ ! సర్పరూపంలో వస్తానన్న నా సుకృతం ఏదీ? ఏమై పోయిందీ ?

సర్పం

(ప్రవేశిస్తూ) ఇక్కడే వున్నాను. దుష్కృతం లాగే సుకృతం కూడా ఎప్పుడూ వెన్నంటే వుంటుంది. (అర్జునుడితో) ఆర్యా, విన్నావుగా ? అతడు పూర్వం ఒక మహాయోగి. ఒక నిరంకుశ ప్రభువును సమర్థించి యోగ భ్రష్టుడై పునర్జన్మకు వచ్చాడు. బాల్యంలోనే జన్మ విమోచన కావాలన్నది అతడి అభిలాష. అదే నేను తెలిసిందా ? ఇక సెలవు.

(సర్పం బాలుణ్ని చేరగా, బాలుడి శరీరం మళ్ళీ నేల కొరుగుతుంది. ఇదంతా కలా అన్నట్టు నిలబడతారు తక్కిన ముగ్గురూ.)

అర్జునకి

పాపం, గౌతమి !

అర్జునుడు

సత్యం ఎంత కఠినం !

గౌతమి

(కన్ను లొత్తుకొని) నా గురించి విచారించకండి, బాబూ ! నా కర్మ ఇలా వుంది. మీ ప్రయత్నం మీరు చేశారు. కృతజ్ఞురాల్ని. వెయ్యేళ్ళు సుఖంగా బ్రతకండి. (నిష్క్రమిస్తుంది)

అర్జునకి

వాస్తవానికీ, భ్రాంతికీ కూడ దూరమై వెళ్ళిపోతోంది. వాస్తవంలో కంటే భ్రాంతిలోనే మనిషికి ఎక్కువ సుఖ శాంతులున్నట్టున్నై.

అర్జునుడు

(సాలోచనగా) నాన్నగారి పితృ సేవా సిద్ధాంతానికీ, ఈ కర్మ సిద్ధాంతానికీ సమన్వయం ఎక్కడో తెలుసుకోవాలి. (అటు దూరంలోకి పరకాయించి చూస్తూ) ఇంతకూ మన పంది ఏమయిందో ?

(అంతలో ఒక పక్క నుంచి చాల కోపంగా ప్రసన్నుడు ప్రవేశిస్తాడు. చేతిలో వేణువు వుంటుంది. అర్జునుడి ఈడు వాడే. అతడి కంటె సౌమ్యుడు. తేజస్వి. ఆగి ఆ ఇద్దర్నీ చూస్తూ నిలబడతాడు. వాళ్ళు కూడా ఇతణ్ని ఆశ్చర్యంగా చూస్తారు. కొద్ది క్షణాల తర్వాత తెరలో నుంచి సోహం కేకలు వినబడతై విసుగ్గా)

తెరలో సోహం

ఓ మహానుభావా ! ప్రసన్న కుమార వర్యా ! ఈ పందిని నేనింక ఈడ్వలేనయ్యా ! కొట్టిందెవరో, తినే దెవరో ! మధ్య మోత నాకెందు కయ్యా, గురో ?

అర్జునకి

(ఉత్సాహంతో) అన్నా ! (మాటలు వినవచ్చిన కేసి సైగ చేస్తుంది. అర్జునుడు కూడా వికసిత ముఖు డవుతాడు.)

ప్రసన్నుడు

(వాళ్ళ కేసి చూసి, తెరలోకి వుద్దేశించి) దాన్ని కొట్టిన వాళ్ళూ, తినేవాళ్ళూ ఇక్కడున్నారయ్యా, సోహం !

(తెరలో) సోహం

ఆహా ! అయితే, వాళ్ళే మోసుకు పోతారులే, దాన్ని ఇక్కడే వదిలేస్తున్నాను.

అర్జునుడు

(తెరలోకి వుద్దేశించి) బాబ్బాబు, కాస్త ఇక్కడిదాకా లాక్కు రావయ్యా, సోహం. నీకు పుణ్యం వుంటుంది !

ప్రసన్నుడు

(కుపితుడై) అంత హేళనగా వున్నదన్నమాట ! అహింసే పరమ ధర్మంగా గల మా ఆశ్రమంలో తలదాచుకున్న మూగ జీవిని పడగొట్టిన పాపం చాలక -

అర్జునుడు

(అతని మాట కడ్డం వచ్చి) ఆఁ, ఆఁ ! అంత గొప్పతనం నా కెందుకు? ఆ పందిని పడగొట్టిన బంటుతనం మా చెల్లెలు అర్జునకిది. ప్రజల శ్రమ ఫలితాన్ని దోచుకు తినే దుష్ట మృగాన్ని శిక్షించడమే పాపమైతే, అందులో సగం నాది. అయితే -

సోహం

(అప్పటికే రంగంలో ప్రవేశించి వున్నాడు) అందులో సగమా? పందిలో సగమా?

అర్జునుడు

పందిలో సగం నీ కిచ్చేస్తున్నాం.

సోహం

(అసహ్యంగా) ఛీ - తూ - మాంసమే? మతంగాశ్రమం లోనే ? అమ్మ బాబోయ్!

అర్జునుడు

అక్కడ నిషేధ మైతే, మా ఆశ్రమానికి రావచ్చు.

సోహం

ఆఁ ? నిజంగానే ? (ప్రసన్నుడి ముఖంలోకీ, దూరంలో పంది వున్న కేసీ ఆశగా చూస్తాడు. ప్రసన్నుడు గుడ్లెర్ర చేస్తాడు. సోహం తగ్గుతాడు. అర్జునకి జాలి పడుతుంది. ప్రసన్నుడికి ఏమీ తోచదు. అర్జునకినే పదే పదే చూస్తూ నిలబడ్డాడు.)

సోహం

మీరు కాబట్టి వదిలేస్తున్నాం. మతంగుల వారికి ఈ జీవహింస గురించి తెలిస్తే బాగుండదు.

ప్రసన్నుడు

ఎప్పుడైనా మీరిటు కేసి వస్తే - విల్లమ్ములు వదిలేసి రండి. ఇది అహింసారణ్యం. ఇక్కడ వేట నిషేధం.

అర్జునకి

ఆ సంగతి తెలిసే, ఇక్కడే ఆగిపోయాం !

అర్జునుడు

(తన చెల్లెలి వంకా ప్రసన్నుడి వంకా ఒకసారి చూచి) ఇక్కడ నిషేధం బాణాల కేనా? లేక, బాణాల్లాంటి -

సోహం

ఆ ! బాణాల్లాంటి చూపులకూ, మాటలకూ నిషేధం - లేదు - కదా మిత్రమా ?

(అందరూ నవ్వుకుంటారు. ఆ ఇద్దరూ అటూ, ఈ ఇద్దరూ ఇటూ నిష్క్రమించడానికి ఉద్యుక్తు లవుతారు. వెళుతూ వెళుతూ అటునుంచి అర్జునకీ, ఇటు నుంచి ప్రసన్నుడూ ఒకేసారి వెనుదిరిగి చూచుకుంటారు. ప్రసన్నుడు ఆగి, మళ్ళీ రంగం మధ్యలోకి వస్తాడు.)

ప్రసన్నుడు

ఎలాగూ ఇంత దూరం వచ్చారు. మా ఆశ్రమం లోకి వచ్చి మా ఆతిధ్యం స్వీకరించి వెళ్ళ గూడదా ?

అర్జునుడు

ఓ, సంతోషంగా ! మతంగుల వారి దర్శనం మహా భాగ్యమే. కాని, ఇప్పుడు కాదు.

జాము ప్రొద్దెక్కు లోపలే మేము ఇల్లు
చేరగలమని చెప్పి వచ్చితిమి ; అపుడె
రెండు జాముల ప్రొద్దెక్కె ; చండ మతుల
ఇప్పటికె తిట్టుకొనుచుందు రింట మమ్ము !

మరోసారి వస్తాం. ఏమీ అనుకోవద్దు.

ప్రసన్నుడు

మిమ్ము చూచిన ఆ నిమిషమ్ము నుండె
మానసమ్మేలా మీ మీదె మసలసాగె ;
మరచి పోకుడు ఇచ్చిన మాట మీరు !
మరల వచ్చెదమను మాట మంచి మాట !

(అర్జునుడితో కరచాలనం చేస్తాడు. ఆ ఇద్దరూ అటుకేసి నిష్క్రమిస్తారు. ప్రసన్నుడు అటే చూస్తూ నిలబడతాడు.)

సోహం

(అతణ్ని కదిపి) అమ్మ ! పందిని కొట్టిన బంటే కాదు, గుండెను తీసిన బంటు కూడా అన్నమాట !

ప్రసన్నుడు

నిజం, మిత్రమా ! ఆమె నా గుండెను తుంచి పట్టుకు పోయింది !

**అసలు నాకున్న గుండెయే పసిది ; దాని**
**చిదుముకొని పోవ, ఇంకెట్లు బ్రదుకు వాడ?**
**సమ్మె కట్టెను నాలోని శక్తులెల్ల !**
**ఎట్లు వచ్చునొ, మిత్రమా ! ఎదద తిరిగి !**

సోహం

ఆ? ఎలా రావడ మేమిటిమ ? నే వెళ్ళి తెస్తా !

( వెళ్ళబోయి ఆగి, ఇడా పింగళ నాడుల్ని పరీక్షించుకొని, తిరిగి వచ్చి) ఇప్పుడు కాదులే. తర్వాత వెళతా. ప్రస్తుతం ఆశ్రమానికి పోదాం.

ప్రసన్నుడు

(నిరుత్సాహంగా) సరే, పద. అంతకంటే చేసేదేముంది ?

**మమతా ధర్మము మూర్తి గొన్న ఒక ధ**
**ర్మవ్యాధు దున్నట్లు విం**
**టిమి; విల్లమ్ముల ఆది భిల్లుదట ; కా**
**నీ – వాని తూణీరమం**
**దు మదాత్మన్ వశ పర్చు కోగల జగ**
**న్మో హాస్త్రమున్ కల్గెనే !**
**అమృతం బోడెదు దాని గాయమున, వ**
**హ్వా, సృష్టి వైరుధ్యముల్ !**

(ఇద్దరూ నిష్క్రమిస్తారు, వెనక్కి చూస్తూ – తెర)

# ధర్మవ్యాధుడు

## అంకం మూడు

(అరణ్య మార్గం. ఈ అరణ్య మధ్య భాగం లోనే మతంగాశ్రమం వుంది. తదితర ఋషి వాటికలు కూడా కొన్ని వున్నై. అరణ్యానికి ఒక చివరలో మిథిలా నగరం వుంది. ప్రసన్నుడి తరఫున మిథిలకు రాయబారం వెళ్ళిన సోహం- అక్కడి వారందరితోను మాట్లాడి తిరిగి వస్తూ - రంగంలోని ఒక చెట్టు క్రింద నిలబడ్డాడు. కొంచెం నిరుత్సాహంగా కనిపిస్తున్నాడు. ఏవో తెగని ఆలోచనలలో మునిగి వున్నాడు. ఆలోచనల కనుగుణంగా తలా, చేతులూ త్రిప్పుతున్నాడు కూడ. కాసేపు ఒక చెట్టు క్రింద నిలబడి, మళ్ళీ నడక సాగించి, మరో చెట్టు క్రింద కొంచెం సేపు విశ్రమించి అలా ప్రయాణం సాగిస్తున్నా డతడు. అది అరణ్య మార్గం. )

సోహం

మానవ మనస్తత్వం కంటె, ఈ అరణ్యం కొంత సరళం.

ఇతడికి ఆ పిల్ల కావాలి. ఆమెకు ఈ పిల్లవాడు కావాలి. ఇక సమస్యేమిటి ?

అదే అర్థం కాదు నాకు !

ఈ సమస్యలన్నీ మధ్యవర్తులు కల్పించేవే ! మధ్య వర్తులు లేకపోతే, సమస్యలే లేవు !

పిల్ల కుటుంబం వాళ్ళు మాంసాహారులు. పిల్లాడి కుటుంబం వాళ్ళు శాకాహారులు. ఇదొక పెద్ద సమస్యా ?

"మా త్రిప్పలు మేం పడతాం, బాబో ! మా ఇద్దర్నీ కలిసి బ్రతక నివ్వం" దంటూ వాళ్ళిద్దరూ గోల పెడుతుంటే కాదనడానికి మధ్య ఈ మధ్యవర్తు లెవళ్ళు ? ఆమె మాంసం మానేస్తుంది. పోనీ, ఇతడు మాంసం తింటాడు. లేక, ఇద్దరూ వేరొక కూరా వండుకుంటారు. ఏం కొంప మునిగిందనీ ?

గాఢంగా ప్రేమించుకొన్న ఇద్దరు యువతీ యువకుల్ని కేవలం కూరలు కారణంగా కలవకుండా చెయ్యడమా?

తల్లి దండ్రులనే వాళ్ళకు బుద్ధి లేదు ! ఇప్పుడేమిటి చెయ్యడం !

"వాళ్ళు మాంసాహారులు. రజో గుణం వాళ్ళది" అంటారు మతంగులు.

మతంగులంటే – మహామునులు ! వారికి ఈ సంగతులే తెలియవు.

అజరా దేవిగారే చెపుతా రివన్నీ ! భర్త తరఫున భార్యే మాట్లాడే సంప్రదాయం ఎక్కడిదో, ఎప్పటిదో !

"వాళ్ళు శాకాహారులు. తమో గుణం వాళ్ళది" అంటారు ధర్మవ్యాధులు.

మరి, సత్వగుణం ఎవళ్ళది ? రాళ్ళదీ, రప్పలదీనా ? అచేతన వర్గాల లోది నిద్రాణత మాత్రమే. గుణం కాదది.

సత్వం ఒక గుణం.

బహుశా – మాంసమూ, శాకమూ రెండూ తినే వాళ్ళే సత్వగుణ సంపన్నులేమో!

ఇంతకీ – మానవ గుణాలకూ, ఆహారానికీ సంబంధం ఏమిటి ? గుణం బీజం తోడిది కదా ?

ప్రసన్నుడికి తన కుమార్తె నివ్వడానికి ధర్మవ్యాధులకు అభ్యంతరం లేదు. ఆయన కున్న భయమెల్లా – వాళ్ళు అహంకారంతో ఆమెను అవమానిస్తారేమోనే ! మతంగుల వారిని ఒప్పించగలరట ! కాని – అజరాదేవి గారి ఆచార మౌర్ఖ్యాన్ని (నోరు తిరగడం లేదు) ఆచార మౌర్ఖ్యాన్ని ఏమీ చెయ్యలేరట.

మతంగ మహర్షులు హేతు బద్ధులు. హేతువాదమే వారి తపస్సుకు మూలం. మతంగ మహర్షుల వారి తల్లి బ్రాహ్మణి. తండ్రి శూద్రుడు. తాను అయితే బ్రాహ్మణుడు, కాకపోతే శూద్రుడు కావాలి కద ? మరి వర్గ బాహ్యుడు ఎలా అయినాడు ? కోపమే చండాలత్వమైతే – దూర్వాసుడు, విశ్వామిత్రుడు, పరశురాముడు లాంటి వారంతా,

పరమ కోపిష్ఠులైన ఈ బ్రాహ్మణ ప్రవరులంతా, ఈ క్షత్రియ వీరులంతా - చండాలురు ఎందుకు కాలేదు ?

ఇదీ ఆయన ప్రశ్న !

దీనికి సమాధానం చెప్పే మగవాడు ఈ ఆర్యావర్తంలో లేడు !

అంతా స్వప్రయోజకులు ! ఏ ఎండకా గొడుగు పట్టుకునే స్వార్థపరులు ! స్వలాభం కోసం దేశమాతనే అమ్మివేయగల దురాత్మకులు !

వర్ణం అంటే గుణం కద ?

గుణం మీద ఆధార పడినట్టిదే వృత్తి కద ?

వృత్తే వర్ణ వ్యవస్థకు మూలం కద ?

మరి - వర్ణ వ్యవస్థ లోని శూద్ర బ్రాహ్మణ సంతానమైన మతంగుడు. వర్ణ బాహ్యుడెలా అయినాడు ? చండాలేడెలా అయినాడు ? అస్పృశ్యు డెందు కయినాడు ? అతడి పట్ల సంఘం చేసిన అన్యాయం ఇది ! మతంగులకు కోపం వచ్చిందంటే - ఎందుకు రాదూ ?

అయితే - మతంగులది సంఘంపై కక్ష !

ధర్మ వ్యాధులది జీవిత ధర్మం ! ఆహార వృత్తి సంప్రదాయాలతో దానికి నిమిత్తం లేదు.

గడ్డి మాత్రమే తింటూ, పశువులై పోయిన శాకాహారులలో ప్రతిభ నశించిపోయి, పాండిత్యం మాత్రం మిగిలింది !

మాంసాహారి సింహంలా రజోగుణి అవుతాడంటే - శాకాహారి గొర్రెలా తమోగుణి ఎందుకు కాదు ?

నిజానికి -

సింహంలా బ్రతకడం కంటె, గొర్రెలా బ్రతకడం శ్రేష్ఠమా ?

ఏ జన్మలోనైనా - ఎలా బ్రతికినా - నిండుగ్గా బ్రతకడం ప్రధానం !

"నీ బ్రతుకు నీవు బ్రతుకు. మరొకళ్ళ బ్రతుకుతో నీ బ్రతుకును పోల్చుకోకు" అంటారు ధర్మ వ్యాధులు.

బ్రాహ్మడెవరు ?

బ్రహ్మజ్ఞానం కలవాడే కద ?

మతంగులు బ్రహ్మజ్ఞానే కద ?

మరి - బ్రాహ్మణుడు కావడానికి మతంగ మహర్షుల వారికి ఈ తపన ఎందుకు?

పాపం శమించు గాక - వట్టి మూర్ఖత్వం ! అదే తమో గుణం !

ఆయన ఇప్పటికే బ్రహ్మజ్ఞాని ! మరి - జందెం కోసమా ఈ కఠిన తపస్సు?

ధర్మవ్యాధుల వారి జీవిత ధర్మ మార్గమే సరియైనదిగా కనిపిస్తోంది !

"నిన్ను నీవు తెలుసుకో, నీ దారిని నీవు పురోగమించు, అదే నీ మోక్ష పథం" అంటా డాయన !

మతంగుల వారిది వ్యక్తిగత సమస్య అనవచ్చు. తమకు జరిగిన అన్యాయానికి తపస్సు ద్వారా ప్రతీకారం సాధించాలను కొంటున్నా డాయన !

ఆయన తపస్సుకు మెచ్చి, భగవంతుడే మోక్ష మివ్వ గలడు.

కాని ఈ వూళ్ళోని బ్రాహ్మణుడు మాత్రం గుర్తించలేడు ! మోక్ష సాధకమైన తపస్సును మానవ గుర్తింపు కోసం తగలేస్తున్నారు మతంగులు !

వ్యక్తిగతంగా జరిగిన అన్యాయాన్ని వ్యక్తిగతంగానే, సాంఘికంగా జరిగిన అన్యాయాన్ని సాంఘికంగానే సరిదిద్దుకోవాలి. అందుకు బలం కావాలి. ఈ తపో దేశంలో తపస్సును గుర్తించే మానవు లెవరున్నా రిప్పుడు ?

విశ్వామిత్రుడు చేసిన పొరపాటు కూడ ఇదే ! వశిష్ఠుడి చేత బ్రహ్మర్షి అనిపించుకోవాలిట ! మరొకళ్ళ గుర్తింపు కోసం ఈ ప్రాకులాట దేనికో ? వట్టి పిచ్చి ! ఒకొకళ్ళ కొకొక పిచ్చి !

అర్జునకి ! బంగారు తీగ ! ప్రణయ విరహంతో మానసం లోని సువర్ణ కమలంలా గుబాళిస్తున్న దామె !

సౌందర్య ప్రసూనమే కాదు, జ్ఞాన ప్రసూనం కూడ !

మా ప్రసన్నుడు మాత్రం తక్కువ వాడా ? సకల విద్యా ప్రసన్నుడు ! నవ మన్మథ రూప సంపన్నుడు ! ఈ విరహ తాపంచే సాన పట్టిన వజ్రంలా మెరుస్తున్నా డిప్పుడు !

ఈ ఇద్దర్నీ విడదీసేది గోంగూరా, వేట మాంసమూనా ?

ఛీఛీఛీఛీ ! ఏం మనుషులు ! ఏం మనస్తత్వాలు !

ఇక – గత్యంతరం ?

గాంధర్వం !

చెల్లెలు సుఖం కోసం అర్జునుడు ఏమైనా చేస్తాడు. అతడు మన పక్షమే.

ధర్మ వ్యాధులు సకల ధర్మాలూ, ధర్మ మోక్షాలూ తెలిసిన వాడు. కనుక, ఆయన మన పక్షమే.

మతంగులు కూడా అంతగా పట్టించుకోరు.

ఇక – అజరాదేవి గారొక్కరు మాకు ఆటంకం ! ఎవరి మాటా వినదావిడ. తనకు తోచదు కూడాను ! ఒక్క తపస్సు మినహా వారేమీ పట్టించుకోక – మతంగులే ఆమెనలా తయారు చేశారు ! మూర్ఖత్వానికి తోడు అహంకారం!

ఏది ఏమైనా – గాంధర్వం మినహా గత్యంతరం లేదు.

అర్జునకీ, ప్రసన్నుడూ – ఇద్దరూ కలిసి లేచి పోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారం.

నిజానికి - ఉభయుల తల్లి దండ్రులూ - పైకి గోల పెట్టినా మనస్సులో సంతోషిస్తారు !

కానీ ఖర్చు లేకుండా తమ బిడ్డలు పెళ్ళి చేసుకోవడం కంటె తల్లి దండ్రులకు మరో ఆనందం ఏముంటుందీ ?

ఏదో, సంఘం కళ్ళ నీళ్ళు తుడవడం కోసం, పైకి కోపావేశాలు ప్రదర్శిస్తారు. అంతే !

ప్రసన్న దేమంటాడో !

ఏమంటాడు ? ప్రియురాలితో కలిసి, ఆ సేతు హిమాచలం, ఒక శృంగార యాత్ర కొట్టి రావయ్యా - అంటే, ఎగిరి గంతులెయ్యడూ ?

ఇదంతా నేను చేశాననుకొని - అజరాదేవి నన్ను పట్టుకొని తన్నితే ?

(చెట్టు మీద నుంచి ఒక కొంగ అతడిపై రెట్ట వేస్తుంది. అతడు గెంతి, కోపంగా పైకి చూస్తాడు.)

వెధవ కొంగ ! మంచి వాళ్ళనిలా మలిన పరిచే ఈ కొంగలన్నీ భస్మం-

(ఆ సమయానికి ఎదురుగ్గా రంగంలో ప్రవేశిస్తాడు కౌశికుడు.)

కౌశికుడు

**(వారిస్తూ) ఓయీ ! వలదు, వలదు !**
**వలదు, వలదగ్గి చూపులు వలదు, వలదు !**
**యతుల క్రోధాక్షణములు దావాగ్ని శిఖలు !**
**తనువు తనువెల్ల వెచ్చించి తపము చేసి**
**గ్రుడ్డి కొంగల గాల్చుట యెద్దె తనము !**

సోహం

(ఆకస్మికంగా వచ్చిన అతడి వంక పరిశీలనగా చూచి) ఎక్కడో కాల్చి వచ్చిన వాడి లాగే కనిపిస్తున్నావే, చూడగా !

కౌశికుడు

(విచారంగా) అవును అదే జరిగింది. ఆ సంగతినే చెప్పుకుందామంటే మనుషులు దొరక్క – ఈ అరణ్యం లోని వృక్ష లతాదు లన్నిటికీ చెప్పుకొంటూ వస్తున్నాను.

సోహం

దీనినేనా అరణ్య రోదనం అంటారు ?

కౌశికుడు

మనిషి కోరేది వృక్ష లతాదుల, పశు పక్ష్యాదుల సానుభూతిని కాదు. మరో మనిషి సానుభూతిని.

సోహం

(సానుభూతితో) నేను వింటున్నాను, చెప్పు !

కౌశికుడు

నేనొక చెట్టు క్రింద కూర్చుని తపస్సు చేసుకుంటూ వుండగా, ఆ చెట్టుపై గల ఒక కొంగ నా మీద రెట్ట వేసింది.

సోహం

ఆс !

కౌశికుడు

అప్పుడు కోపోద్రిక్త రక్త దృక్కులతో దానికేసి చూశాను !

సోహం

అది భగ్గున పడి భస్మమైంది !

కౌశికుడు

జరిగిన దానికి విచారిస్తూ, మధ్యం దిన చండ భానుడిలా జఠరాన్ని జ్వలిస్తూ వుండగా, భిక్షకై బైలుదేరి, ఒక ఇంటి ముందు నిల్చాను !

సోహం

మరి, కొంగ ? ఓహో - భస్మమై పోయింది కదూ !

కౌశికుడు

నేను బ్రాహ్మణ్ని, శాకాహారిని.

సోహం

బ్రాహ్మలంతా శాకాహారులు కారు.. శాకాహారులంతా బ్రాహ్మలు కారు. ఆహారానికీ, జ్ఞానానికీ సంబంధం లేదులే. అగస్త్యులవారు నర మాంసమే తిన్నారు. రంతి దేవుల వారు తన జీవితంలో కోసిన మొత్తం డెబ్బైమూడు కోట్ల గోవుల్ని తిన్న వారంతా బ్రాహ్మలే ! దానికేం నీ కథ కానీ !

కౌశికుడు

(నిరుత్సాహంగా) సానుభూతి లేని వాడి దగ్గర కష్టసుఖాలు చెప్పుకోవడం దుర దృష్టం.

సోహం

(నవ్వి అతడి భుజం తట్టి) కష్టసుఖాలు అందరికీ వుంటై. సమానంగా కూడా వుంటై. నీ కష్టసుఖాలకు ఒక ప్రత్యేకత వుంటే తప్ప మరొకడికి నీపై సానుభూతి కలగదు. తాను వలచింది రంభ. ప్రతి వాడికీ తన ప్రియురాలు రంభే ! అంతమంది రంభలతో ఎలా చచ్చేది ? ఒక్క తపస్సే చాలదు మనిషికి ! మానవ మనస్తత్వం, ప్రకృతి ధర్మం ప్రగతి కూడ తెలియాలి. ఆ గోవులంతా ఇప్పు డెందుకులే. నీ కథ కానీ ! నిజంగా, అపూర్వంగా వుంది !

కౌశికుడు

అవును, అపూర్వమే ! ఆ ఇంటి ఇల్లాలు - దేవత అంతటి సౌందర్యవతి - ఆగుమని చెప్పి, లోనికి పోయి, తిరిగి రాలేదు.

సోహం

ఓహో !

కౌశికుడు

నేను అలానే నిలబడి వున్నాను ఆ మధ్యాహ్నపు ఎండలో !

సోహం

ఆ వాకిట్లో చెట్టు నీడ కూడా లేనట్టుంది. (కౌశికుడు చుర చురా చూస్తాడు)

సోహం

నేను కొంగను కాదులే చెప్పు.

కౌశికుడు

ఒక గంట తర్వాత, ఆమె హడావిడిగా ప్రవేశించింది భిక్షతో !

సోహం

(కసిగా) ఆ దుర్మతి నీ ఉగ్ర కోపాగ్ని జ్వాలలలో మల మలా మల మల మలా-

కౌశికుడు

ఆగు ! మిత్రమా, ఆగు ! మన కోపాగ్ని ఒక అగ్గిపుల్ల ! ఆమె పాతివ్రత్య శక్తి ఒక ఝుం ఝూం మారుతం !

సోహం

ఓ ! (విరుచుకు పడిపోబోగా కౌశికుడు పట్టుకుంటాడు)

కౌశికుడు

ఎందుకు నీకీ భ్రాంతి ? ఆమె ఒక మహా పతివ్రత ! అదే సమయంలో ఆమె భర్త పని నుంచి ఇంటికి రాగా, అతడికి పరిచర్య చేయడంలో తడవయిందట ! అతడు విశ్రాంతుడు కాగానే భిక్ష తీసుకు వచ్చింది.

సోహం

అప్పటికైనా ఆమెకు మనం జ్ఞాపకం రావడం మన అదృష్టమే అంటావు ?

కౌశికుడు

ఔను !

సోహం

(అతణ్ని కౌగలించుకొంటూ) మానవ మనస్తత్వ సహజ విలువల్ని ఇంత నిశితంగా అర్థం చేసుకొన్న నీవు నా మిత్రుడివి !

కౌశికుడు

అంతే కాదు, ఆమె చేసిన ఆలస్యానికి నేను దూర్వాసుణ్నే అయి, ఆమె కేసి చుర చుర చూసేసరికి, ఆమె చిరునవ్వు నవ్వుతూ ఏమన్నదో తెలుసా ?

సోహం

(ఉత్కంఠతో) ఏమన్నది ?

కౌశికుడు

ఇప్పుడు నీ వన్నట్టే నేను గుడ్డి కొంగను కాదు, అన్నది !

సోహం

ఓ ! ఓ ! (రంగం అంతటా గంతులు వేస్తాడు)

కౌశికుడు

అంతేకాదు. నేను చాల తీక్షణ ప్రకృతిననీ, బ్రాహ్మణుడికి కోపం, క్రోధం అసలు పనికి రావనీ ఆమె అన్నది. మిధిలా నగరం వెళ్ళి, అక్కడ సకల ధర్మ సూధుడైన ధర్మవ్యాధుడి దగ్గర ధర్మ సూక్ష్మాలు తెలుసుకో మన్నది !

సోహం

(అత్యాశ్చర్యంతో) ధర్మ వ్యాధుల దగ్గర ?

కౌశికుడు

అవును

సోహం

మాంసం అమ్ముకుని బ్రతికే ఒక నీచకులం వాడి దగ్గర – ఒక సద్బ్రాహ్మణుడు ధర్మోపదేశం పొందడమా ?

కౌశికుడు

(నవ్వి) వైదిక ధర్మం ఇంకా నడుస్తున్న సత్యకాలం ఇది. నీవు మరీ – ముందెప్పుడో రాబోయే కలికాలం గురించి చెప్తుతున్నావు. ఈనాడు ధర్మమే ప్రధానం. కులం కాదు. కలి కాలంలో కులమే ప్రధానం. ధర్మం కాదు. ధర్మ భ్రష్టులంతా ఉత్తమ కులాలుగా చలామణీ అయ్యే కలికాలం మాట ఇప్పు డెందుకు తెస్తావు ?

సోహం

(తృప్తిగా) బాగా చెప్పావు, మిత్రమా, బాగా చెప్పావు ! కలికాలం ఛాయలు అప్పుడే మా మతంగ ముని వాటికల మీద పడసాగినందు వల్ల, నా నోట ఆ మాట వచ్చింది. అపకారం తలపెట్టిన నీకు ఇంత ఉపకారం తలపెట్టిన ఆ పతివ్రత ఎవరో – ఆ మహా తల్లికి నా జోహారులు !

కౌశికుడు

నాకు నిజంగా మోక్ష మార్గం చూపిన తల్లి ఆమె ! ఈ మార్గం తిన్నగా మిధిలకే వెళుతుంది కదా ?

సోహం

ధర్మ వ్యాధుల ఇంటికే వెళుతుంది. నేనిప్పు డక్కడి నుంచే వస్తున్నాను.

కౌశికుడు

(సంతోషంతో) ఓహో, ఎంత అదృష్టవంతుడివి ! ఇక నేను ఆలస్యం చెయ్యరాదు. సెలవు !

సోహః

నేను కూడ చాలా ఆలస్యం చేశాను. ఇప్పటికే తిట్టుకొంటూ వుంటారు. సెలవు !

(ఇద్దరూ వేరొక ప్రక్కకూ నిష్క్రమిస్తారు – తెర)

# ధర్మ వ్యాధుడు

## అంకం నాలుగు

(అడవి మార్గం. దిక్కులు చూచుకొంటూ, ఏదో విపరీతమైన వాసనకు ముక్కు నలుపుకొంటూ, కౌశికుడు ప్రవేశించాడు. మిధిలా నగరం సమీపిస్తున్న లక్షణాలు కనిపిస్తున్నై. నగరం శివార్లలోని ఆటవికుల కుటీరాలు కూడ అక్కడక్కడ దర్శన మిస్తున్నై.)

కౌశికుడు

బహుశా అదేదో కోయగూడెం అనుకుంటాను.

సంతత క్రియాగత జన సంకులమ్ము,
కాక కుర్కుర మక్షి కాద్యా కులమ్ము,
అదియె కావచ్చు ధర్ముని ఆపణమ్ము !
ధర్మ సూక్ష్మమ్ము ! మనుజాత్మ దర్శనమ్ము !

ధర్మ వ్యాధులు నిశ్చయంగా ఆయనే ! ఓహో ! మిథ్యావలయం చుట్టూ మిలమిల మెరిసిపోతున్న సత్యంలా వున్నా డాయన !

అల్ప మృగ మాంస ఖండంబు లంగడి నిడి,
అమ్ముచున్నాడు విజ్ఞాన మవని కతడు !
క్రోధములు, కక్ష లన్నియు కూడ నివియె
నమ్ముడను రీతి చిరునవ్వు నవ్వుకొనుచు !

ఈ దుర్వాసన భరించలేకుండా వున్నాను ! ఆయనక్కడ ఎంత నిర్వికారంగా కూర్చుని వున్నాడు !

వాసనా మయమైన విశ్వమ్ము లోన
వాసనా రహితుడు పోలె వరలు నితడు !
ఏది చెడు ? ఏది మంచి ? ఈ యెల్ల సృష్టి
వాసనలకును నిలయ మీశ్వరుడె కాడె !

ఈ మహాత్ముణ్ని చూచే కొలదీ, ఎందుకో - ఇది వరకెన్నడూ రాని విశిష్ట భావాలు నా మనసు లోకి వస్తూ వున్నై ! పరమ దుస్సహాలైన పరిసరాలు పవిత్రాలై కనిపిస్తున్నై ! నేను తెలుసుకోవలసిన ధర్మ సూక్ష్మాలు వాటంతట అవే అవగత మౌతూ వున్నై !

**తన పరీ వాహమున పడ్డ చినుకు ప్రతీది**
**తానె కాకున్న అస్తిత్వత నది కేది ?**
**బ్రహ్మ విద్యా గురువు నట్టి వాడె కాదె ?**
**నుడువులను మించి మనసు చెప్పెడిదె విద్య !**

మనిషిని చూడకుండానే, త్రికరణ శుద్ధిగా తనను కోరుతున్న మనస్సును మనస్సుచే గ్రహించి, బోధించి, తరింప చేయగలవాడే నిజమైన బ్రహ్మ విద్యా గురువు.

తత్వజ్ఞుడే తత్వమయుడు. తదితరుడు కేవల దాంబికుడు. తత్వజ్ఞుడైన వాడికి బాహ్యాడంబరాలతో పని లేదు. వృత్తుల తారతమ్యాలతో అసలే పని లేదు. జీవుని స్వరూప స్వభావాలు, వృత్తి ధర్మాలు కర్మాను బద్ధాలు, పరిణామ శీలాలు, క్షణ క్షణాలు. ఆత్మ ఒక్కటే కదా సత్యమూ, నిత్యమూ ? కాంతికి అంధకారం వలె ఆత్మ జ్ఞానికి కర్మే నశించి పోతున్నప్పుడు - కర్మానుబద్ధమైన బాహ్య విషయాల ప్రసక్తే దేనికి ?

కులం వృత్తికి సంబంధించింది కదా ! ఒకే వృత్తి చేసే వాళ్ళు పదిమంది కలిస్తే - అదొక కులం అయింది ! ఒకొక్క కులం ఒకొక్క కుటీర పారిశ్రామిక కేంద్రం ! అంతవరకే దాని ప్రాధాన్యం !

వృత్తులలో మంచివనీ, చెడ్డవనీ లేవు. ఏ వృత్తి చేసేవాళ్ళకు ఆ వృత్తి మంచిది. ప్రతి వృత్తి జీవనాధార మైనట్టిదే ! నాకు భిక్ష మెత్తడం వృత్తి. అతడికి మాంస విక్రయం వృత్తి. ఏ వృత్తి అయినా భుక్తి కోసమే. వృత్తికీ, జ్ఞానానికీ సంబంధం లేదు. వృత్తి భౌతికం. జ్ఞానం ఆత్మీయం. ధర్మవ్యాధులు జ్ఞాని. ఆయన నా గురుదేవుడు !

ఎవ్వరతడు ? ఏమిటి తను ? ఏమి చేయు ?
అనెడి ప్రశ్నలు అజ్ఞాన జనితములగు
తొలకరించిన చాలు రైతులకు నిందు,
నీటి నెందుండి గ్రోలిన నేమి మబ్బు ?

అదిగో, ధర్మవ్యాధులు లేచి, ఇటే వస్తున్నారు !

(సంభ్రమంతో చేతులు జోడిస్తాడు. అప్పుడు ధర్మవ్యాధుడు రంగంలో ప్రవేశించాడు. మంచి తేజోమూర్తి. మొలకు చుట్టుకొన్న అంగవస్త్రం తప్ప మరే దుస్తులూ లేవు. చిరునవ్వుతూ సూర్యోదయంలా వుంది అతడి ముఖం. వస్తూనే కౌశికుడి నమస్కారానికి ప్రతి నమస్కారం చేస్తాడు.)

ధర్మ వ్యాధుడు

ఒక పతివ్రత పంపగా, ఓ మహాత్మ !
కదలి వచ్చిన వాడవు కాదె నీవు ?
నీ మనసు కూడ నే నెరింగితిని, కాన
సంతసంబయ్యె ; నీ కిదె స్వాగతమ్ము !

కేవల మామె మాటల నొ
కించుక మన్నన చేయ గోరి ఈ
త్రోవకు వచ్చినావొ ? కల
దో మరి నీకును నన్ను జూడగా
భావము ? ఆత్మలో తెలిసి
వచ్చుటలో తడవయ్యె ! సైపు మీ,
పావక తేజ ! నా గృహము
పావన చేసితి ; వేను ధన్యుడన్ !

అవని నెవరేది కావలె నన్న కూడ
అభి ముఖత్వము లేకుండ అందదెదియు ;
ఆత్మ మట్టాన నాలోన నైక్య మొంది
నిఖిల ధర్మమ్ములను గ్రహించితివి నీవు !

ఇపుడు నీవెరుంగని దింక ఏమి కలదు ?
మధు విభూతియు కరతలా మలకమయ్యె !
రెండు విషయాలలో శంక నుండ నోపు,
తెలియ నడుగుము, తెల్పెద తెలిసినంత !

కౌశికుడు

భో ! మహాత్మా ! నీ యెరుక అద్భుతము ; నేను
ధన్యునైతిని నీ భవ్య దర్శనమున !
నిన్ను మనసున తలచిన నిమిష మందె
సొంత మైనవి సర్వ వేదాంత రుచులు !

ధర్మ విదుడవు, వేదాంత దర్శకుడవు ;
నిన్ను గూర్చిన శంక లేమున్న వింక ?
అయిన, నడిగెద వివరింపు మనఘ చరిత !
హింస యన నేది? ఏది అహింస యనగ ?

ధర్మ వ్యాధుడు

కర్మననుసరించి కాదె భూతమ్ముల
జనన మరణ విధులు జరుగు చుండు ?

చంపు నట్టి దెవడు ? చచ్చెడి దెవ్వండు ?
భుక్తి యౌన దెవడు ? భోక్త యెవడు ?

జీవనమ్మును తినకుండ జీవనమ్ము
ప్రభవ మందదు, పెరగదు, ఫలము నీదు ;
పెండలమ్మేదొ, అదె మాంస ఖండము నగు !
వేపి చల్లిన మొలచునా విత్తనములు ?

భూమి, నీరు, గాలి, భూత సమస్తమ్ము
జీవ మయము గాన - జీవ హింస
చేయకుండ నెవడు జీవించ నేరడు ;
నేర్తు ననెడి వాడు నేరగాడు !

ఎవ్వరి దైన జీవ మొక
టే; పరమేశ్వర నామ వచ్యమౌ
పువ్వున తావి యౌనది, గు
బుల్కొని యున్నది విశ్వ మెల్లెడన్ ;
క్రొవ్విన రేణువున్ మెసలి,
క్రొత్తది క్రొవ్వుచు నుండు ; ఇట్లుగా
ఇవ్వ సుధా ప్రజీవ గతి
యేగుచు నున్నది స్వ : పురోగతిన్ !

కౌశికుడు

(సాష్టాంగపడి లేచి) ఓహో ! మహా భాగా !

నీకు కానిది లేదు ఈ లోకమందు ;
విశ్వమే నీకు పూదోట విధము కాదె ?

నీవు తావివి ; మానసా నిల తరంగ
డోలికల భావ లీలల దేలుచుందు !

నేతి నేతిగ పేర్కొన్న నిర్గుణమున
సగుణమౌ జగమే రీతి సంభవించె ?
జనన మరణమ్ము లేక్రియ జరుగుచుండు ?
కర్మయన నేమి ? చెప్పవే కర్మ రహిత !

ధర్మ వ్యాధుడు

కాదు నిర్గుణి, సగుణియు కాదు బ్రహ్మ ;
అదొక జ్ఞానము ; అమృత పదార్థ మద్ది ;
అదియు సమ్యక్త రంగ నిరంతరమ్ము ;
నిత్య చైతన్య వీచికా నిర్భరమ్ము.

ఆది మధ్యాంత రహితమౌ అమృత జలధి
ఎడ తెరపి లేని కెరటాలె ఈ జగాలు ;
కెరటముల వేగముల లోని తర తమాలె
జగము లందలి వైవిధ్య జాల మెల్ల !

పుట్టిన తరంగమున జీవ భూతి యెంతో
అంత ఆయుస్సు దానికి ; అణగు పిదప ;
లేదు భూతాన బీజాన లేని భూతి !
జనన మరణమ్ము లిట్లు బీజ స్థితములు !

కెరటము పైకి లేచి, మరి
క్రిందకు తూలును ; అద్దె జీవమున్
మరణము ; తత్త రంగము పు
నః పున లేవగ నేది హేతువో
పరగెడు నద్ది కర్మయన ;
బ్రహ్మ పయోధిని జీవ వీచికన్
తరిమెడి శక్తె కర్మ ; అది
తత్త్వము తోడిదె ; ప్రాణ భూతమే !

కర్మ యనగ తానె ; కర్మకు వేరయి
బ్రతుకు లేదు ; కాన, బ్రతుకు టనగ
కర్మ యగును ; కర్మ కలిగించు ఘర్షణ ;
ఘర్షణమున హింస కలిగి తీరు !

బ్రహ్మ లోనిదె కర్మ ; కర్మాను గతమె
సర్వ సృష్టియు ; పుట్టును చచ్చు నందె ;
జ్ఞానమున వెలుగున్నది కాన, జ్ఞాని
దుఃఖ మొందదు ; తెలివి సంతుష్టి నొసగు !

జ్ఞానియును, జ్ఞాన హీనుదును
సాగెడి దారులు వేరు వేరులే
యైనను, లక్ష్య మొక్కటియె
యౌ ; కల భేదము వెల్గు చీకటుల్ ;

ఈ నిజమెంచి యెవ్వడు జి
తేంద్రియుడై, సముడై వసించు త
న్మానవుడొందు నెల్ల భవ
మాధురులున్ అజరామృతమ్ముగా !

ఆత్మకే గాని అందదీ అచల విద్య ,
మాట మాత్రముగా నెట్లు మప్పు వాడ ?
ఆత్మ నైక్యము జేసి విశ్వాత్మ లోన,
పరమ చైతన్య మూర్తివై పరగు మయ్య !

సమయమైనది నాకు నా జనని జనకు
సేవకై ; ఏ తదేకైక సేవయె సుమి
నా కొసంగిన దీపాటి జ్ఞాన దీప్తి !
సిద్ధికి ప్రపత్తి మార్గము శ్రేష్ఠ తరము !

అతిథి మర్యాద మిగిలి యున్నదిక నాకు,
మిగిలె నీకును తెలుసుకో దగిన దొకటి ;
వెడలుదము లోనికిక ; లోన వేచి యుంద్రి
నిన్ను దీవింప నా జననీ జనకులు !

కౌశికుడు

(వినమ్రుడై) వ్యాధ రూపంలో అవతరించిన కర్మవ్యాధా ! ధర్మ వ్యాధా !

మానవుని లీల నున్న బ్రహ్మ స్వరూప !
నన్ను నీ పంక్తి లోకి గైకొన్న కతన

నీవు నేనును నొక్కటే భావమైతి ;
మింక నీవెవ్వరే నెవ్వరీ జగాన ?

గురువు శిష్యుడాయె, గురువయ్యె శిష్యుండు,
గురువు నిజము గానె పరముడ గుట !
నీకు తల్లి తండ్రి నాకును తలిదండ్రె !
వారి దీవనములు చేరె నన్ను !

పరమ పదమును గోరు ఏ నరునికైన
తల్లి దండ్రుల సేవ కర్తవ్యమగును ;
మనిషి కర్తవ్యమును వీడి, మహికి చేయ
గల్గునది లేదు, లేదు, నిక్కముగ లేదు !

తెలిసినదయ్య, నా తెలివి
  తేగలు తిన్నది యెక్కడో ! మహా
తలచిన వాడ బోలె, తలి
  దండ్రుల వీడి, తపస్సు చేసితిన్ !
అలసపు కొంగలన్ దునుము
  నగ్ని కనుంగవ జేరె గాని ; ఈ
యలఘు తర ప్రభావ పర
  మాత్మ సమైక్యము దూరమయ్యె పో !
నాకు కాన్పించుచున్నారు నా పితరులు
ఈవు నా కొసంగిన దివ్య దృష్టి కతన !
నా కొరకు ఏడ్చి ఏడ్చి అంధ తను గొనిరి !
ఇప్పుడే పోయి వారి సేవించు వాడ !

(ధర్మవ్యాధుడికి సాష్టాంగపడి, నమస్కరించి, పాదధూళి గ్రహించి, తొందరగా నిష్క్రమిస్తాడు. ధర్మవ్యాధుడు అశ్రుపూరిత నయనాలతో అతడు వెళ్ళిన కేసే చూస్తూ

నిలబడతాడు. అంతలో రెండో ప్రక్క నుంచి గౌతమి ప్రవేశించింది. నిలబడి నమస్కరించింది. ధర్మవ్యాధుడు ప్రొద్దు చూస్తాడు.)

గౌతమి

మహాత్మా ! నీ పితృపూజకు వేళ మించనివ్వను. నాకున్న దెల్ల ఒక్కటే సందేహము.

తల్లి దండ్రుల పూజ కర్తవ్య మనుచు
బ్రాహ్మణుని కేదొ బోధించి పంపినావు ;
నా కుమారుడు బాలుడు నన్ను విడిచి,
పోయి కాలుని చేరుట న్యాయ మగునె ?

ధర్మవ్యాధుడు

వసుధ జన్మించినట్టి ఎవ్వరికి నైన
బ్రతికి యున్నంత వరకె కర్తవ్య ముండు ;
చావు బ్రతుకులు కాలుని సేవకులగు !
కాలుడును కూడ కర్మకు కాలి బంటె !

బ్రతికి యున్నంత కాలము బ్రతుకు కెట్లో
చచ్చి యున్నంత కాలము చావు కట్లె
కలదు కర్తవ్యమను నది కనుక, జీవి
ఎట్లు చచ్చిన వెన్క సేవించు బ్రతుకు ?

కాలుడే కాదు కర్మకు కాలి బంటు ;
ఉర్వి నెల్ల సంయోగ వియోగ ములును
కర్మ తోడివ ; కనుక, దుఃఖమ్ము విడిచి,
జీవ తత్వమ్ము గని, స్వస్థ చిత్తవగుము !

నీవు మొన్న కానలో విన్న దెల్లయు,
కన్న దెల్లయును సుఖ ప్రదమ్మె ;

నీవు, నేను, నెల్ల జీవులు కర్మయే ;
కర్మ కాని దేమి కలదు ? తల్లి !

(గౌతమి అతడికి వంగి నమస్కరించి, మాటాడకుండా నిష్క్రమిస్తుంది)

ధర్మ వ్యాధుడు

(నిట్టూర్చి, నుదురు తట్టుకొని, విచారంగా) కర్మ ! సర్వ శక్తిమతి ! విశ్వరూపిణి!

కర్మము కానిచో – కడుపు
కాచిన కాయ, మదీయ పుత్రి, స
ద్ధర్మ – విధర్ము నొక్కని యె
దన్ వరియించిన దన్న నందులో
మర్మ మదేమి ? ఈ ప్రణయ
మార్గముల ద్భుతముల్ ! శుభ స్థితిన్
నిర్మలమై తదర్ధ ములు
నిత్య సుఖ ప్రదమై రహించుతన్ !

(ప్రవేశం సోహం – చేతులు మోడ్చి)

సోహం

విజయోస్తు, గురువర్యా, విజయోస్తు !

ధర్మ వ్యాధుడు

శుభమస్తు ! ఎవరు ? సోహమా ?

సోహం

మతంగుల వారు మీకొక వార్త చెప్పమన్నారు. మీ అమ్మాయి గారు, వారి అబ్బాయి గారు విశ్వ విహారం కోసం బయలుదేరి వెళ్ళారు. మతంగుల వారే వారిని ఆశీర్వదించి పంపించారు.

ధర్మ వ్యాధుడు

సరే మంచి వార్త. (పైకి చూచి) లోనికి పోదాం. పితృసేవా సమయం అయింది.

(ఇద్దరూ నిష్క్రమిస్తారు – తెర)

# ధర్మ వ్యాధుడు

## అంకం అయిదు

(ఒక మహారణ్యం. అక్కడక్కడా ఆశ్రమాలు కన్పిస్తున్నై. ప్రకృతి పుష్ప ఫలాదులతో రమణీయంగా వుంది. వనస్పతుల బృందగానంలా ఒక పాట వినిపిస్తున్నది. వివిధ రకాల పక్షులు, మృగాలు అట నట సంచరిస్తూ వున్నై.)

తెరలో పాట

రండు రండోయి, నా రాగ హృదయము లోకి !
నా రాగ హృదయమే గారాల సదన మోయ్ !
సర్వ జనముల సుఖము
స్వాంతమున కాంక్షించి,
తపము చేసిన ఋషుల
ధన్యాత్మ నేనోయి !
రండు రండోయి నా రాగ హృదయము లోకి !
నా రాగ హృదయమే గారాల సదన మోయ్ !
అగ్ని నారాధించి,
యజ్ఞాలు సాగించి,
అజ్ఞానమును త్రుంచి,
నట్టి వేదాత్మ నోయ్ !
రండు రండోయి నా రాగ హృదయము లోకి !
నా రాగ హృదయమే గారాల సదన మోయ్ !
ప్రేమికుల హృన్మ ధువు,
వీరుల రుధిర వహ్ని,
గ్రోలి పెరిగిన నేను
కూర్మి సఖినోయ్ మీకు !

(ఆవిధముగా సర్వ సన్నద్ధమై, సాను భావ ప్రాభావితమై వున్న మహావన రంగంలోకి ప్రవేశించారు - అర్జునకీ ప్రసన్నులు ! చైత్రోదయ అరుణోదయం లోని రెండు పద్మాల వలె, వైశాఖ దిన పూర్ణిమా సంధ్యలోని రెండు రక్తోత్పలాల వలె - ప్రణయ ప్రభా ప్రభాసితులై, ఆనంద పరవశులై వున్నారు ఆ ఇద్దరూ ! అతడు మతంగ మహర్షి కుమారుడేనా ? ఆమె ధర్మ వ్యాధుడి కుమార్తె యేనా? ఎందుకీ వ్యర్థ జిజ్ఞాస ? వారు ప్రస్తుతం ప్రకృతి పురుషులు ! అంతే ! ప్రణయ లీలా కళా మూర్తులు ! అంతే ! పరమ శృంగార యాత్రికులు ! అంతే ! వారి వేష భాషలు నవ వధూవరులవి !

సిగ్గు ఇద్దరికీ వుంది. జన్మ సంస్కారాల ప్రాబల్యం ఇద్దరికీ సమానమే. పుట్టి పెరిగిన పరిసరాల ప్రభావం ఇద్దరినీ సమానంగా అరికట్టేదే ! కానీ - ఈ సర్వము, ఈ బాహ్య విభేదమంతా వారి ఆంతరంగిక ప్రణయ మహా విప్లవంలో తృణప్రాయమై నశించి పోయినై ! వారికి ఇప్పుడు పూర్వాపరాలు లేవు. క్రొత్తగా వికసిస్తున్న రెండు మొగ్గలు వారు ! అంతే !)

ప్రసన్నుడు

ప్రియా !

**శుక పిక మిళింద మోహన సూక్తి తోడ**
**పిల్చు చున్నది వింటివే విపిన లక్ష్మి ?**
**నాకు పరిచితమే కాన, నీకె యౌను**
**రాగమయమైన ఈ ప్రియ స్వాగతమ్ము !**

నేను ఈ వనానికి పాత వాణ్నే. ఈ అపూర్వ స్వాగతం నీకే !

**భ్రమర రాశులు, పుష్ప గుచ్ఛములు, వివిధ**
**శీధువులు, చిత్రధును, లద్రి శిఖర పంక్తి,**
**సైకతమ్ములు, సరసులు - సర్వ రుచుల**
**వనము నిను పోల పోటీలు పడెటు నదిగో !**

అర్జునకి

ప్రియా !

నాకు నున్ క్రొత్త కాదీ వన ప్రియ రమ !
మంచి అను రూప వరునితో మరలి రమ్మ
టంచు ప్రతిసారి నన్ను దీవించు నీమె !
తన పలుకు సత్యమైన సంతస మిదెల్ల !

నేను కూడ ఈ వనానికి పాత దాననే ! ఈ అపూర్వ స్వాగత సన్నాహ మంతా నీ గౌరవం కోసమే ! నీ ఆనందం కొరకే ! నిజానికి - అసూయ పడవలసిందే తప్ప, నాతో పోటీ పడవలసిన దేమున్నదీ వనేందిరకు ? మా కిద్దరకూ పోటీ ఎక్కడ ?

ఆమె అజరామృత మనోజ్ఞ యౌవన రమ !
నేను క్షణ మాత్ర యౌవన శ్రీని కాదె ?
ఆమె సేవను గల సహస్రాంబుజముల
నేను నొక దాన - మానవి నేను గాన !

మనుజ కాంతను నేను ; నా మధురిమము !
క్షణిక మాత్రమె యైనను మనసు కలది !
పరమ రాగము నాది ; ఈశ్వరుడు వీవు !
ఈ వసంతుడు నీ ప్రియ సేవకుండు !

జరయు, మృతియు లేని జవ్వని యౌ గాక !
సకల రుచుల వారస యగు గాక !
ఎందు మించ గలదు ఇహ భోగమున నన్ను
వన శివాని ? నేను - వర శివాని !

చైత్రుకంటె నీవు శత విధమ్ముల గొప్ప,
కనుక - నేను గొప్ప వనము కంటె ;
అంతె కాని, మాకు అర మరికలు లేవు !
లేని పోని యీసు లేల సతికి ?

ప్రసన్నుడు

చైత్రుడను నేను, నీవు వసంత రమవు ;
ఈ మహా రణ్యమే మన ప్రేమ భూమి ;
ఆ సర స్తీర దూర్వ శయ్యా తలమ్ము
నిన్నె కాబోలు పిల్చుచుండినది, కనుము !

(అర్జునకి అటు చూచి, ఇటు ప్రసన్నుని కళ్ళలోకి చూచి, ఒక్క గంతున అటు పారిపోతుంది. ప్రసన్నుడు ఆమెను అనుసరిస్తాడు. కొద్ది సేపట్లోనే తిరిగి వారిద్దరూ రెండో వైపు నుంచి రంగంలో ప్రవేశిస్తారు. చాల అలసి వున్నారు. చాల దూరం ప్రయాణం చేసి వున్నారు కూడ. )

అర్జునుడు

ఎంత మనోహరంగా వుంది ఈ కొండ శిఖరం ! సమస్త విశ్వానికీ ఇది కేంద్రం కాదు కదా ! అబ్బ ! ఎంత హాయిగా వుంది ! (అతడి రొమ్మున శిరస్సు ఆన్చి నిలబడి హఠాత్తుగా అతడి కేసి తిరిగి, రొమ్ము చరుస్తూ) ప్రియా ! అదిగో చూడు - ఈ చుట్టు

తెల్ల త్రాచుల రీతిగా, మల్లెపూల
దండలోయన, ఈ వెండి కొండ చుట్టూ
వర్షిలుచు - శివార్చనకు శివాని సేక
రించిన మహార్ష మట్లున్న వేమిటవ్వి ?

ప్రసన్నుడు

(నవ్వి, ఆమె తల నిమురుతూ, జటలోని మల్లెదండల్ని లాగి, మళ్ళీ తురుముతూ) ప్రియా,

చిత్రమయ్యె ! త్రికుటాద్రి శిఖర మందు
నిల్చి యున్నాము మన మిపుడు నిక్కువ ముగ !
నాన్న చెప్పగ చాల విన్నాను కాని,
దీని నెన్నడు కనలేదు నేను కూడ !

నీవు చేసిన ఊహయు నిజము, దేవి !
కేంద్రమే యగు విశ్వాని కెల్ల నిద్ది !
ఇందు నిలబడి చుట్టును కందు మేని
బహు ముఖమ్ముల గనిపించు బ్రహ్మ సృష్టి !

ఎందో ఎందో తిరిగి, ఎంతో ఎంతో చూచి,
ఏదో ఏదో అనుభవించి నాము !
ఇందు గల్గు సౌఖ్య సౌందర్యముల సాటి
ఒక్క నీవు తప్ప, ఉర్వి లేదు !

నీకు వలె ఈ ప్రకృతి బహు ముఖ సౌందర్యవతి, మాధుర్యవతి, తేజోవతి ! ఆ కనిపిస్తున్న మల్లెదండలు, వెండి తీగలు, తెల్ల త్రాచులు మనం సేవించిన, సేవించ దలచిన నదీ నదాలు ! ఈ సమస్త భూగోళము - దాని రెండు ప్రక్కలు కూడ ఒకేసారి కనిపించేదీ శిఖరం నుంచే ! చూడు -

మగువ ! మనమున్న ఈ ప్రక్క సగము పగలు !
తొగల చుక్కల ఆ ప్రక్క సగము రాత్రి !
రెండు సగముల పూర్ణ పూర్ణేందు మౌళి
దర్శనమ్మన ఇది ప్రమోద ప్రదమ్ము !

అర్జునకి

(భక్తితో చేతులు మోడ్చి) ఔను, ప్రియా ! ఔను ! నిజంగా మనం ధన్యులం !

ప్రసన్నుడు

అర్ధ నారీశ్వర కరుణా ప్రసాద లభ్యులం కనుక - ఈ సర్వ జగత్తూ, సర్వ సుఖాను భూతీ మనకు కరతలామలకం ! ఇప్పుడు చూడు -

అదిగొ మనము జలక్రీడ లాడు కొన్న
పూర్ణ సుందర శత పత్ర పుష్కరమ్ము !
అదిగొ మనము సూర్యునికి సాష్టాంగ పడిన
సప్త జలధీ ప్రతీ రైక సైక తమ్ము !

హైమవతి గని, శివుని లోకైక నాథు
నొనరిచిన హిమవంతుని మణి కిరీట
మదిగొ, పాలించుచున్నది ఆర్య భూమి !
కానిపించుచు నున్నదె మానసమ్ము ?

అదిగొ కన్యా కుమారి ! ఏ ఆర్య కన్య
ప్రణయ విభుకై యాజించెనో ప్రాణములను
ఆమె అమృత జీవనమున కంజలి అది !
కోటి వైరుధ్య భావాల కూడలి అది !

ఏది తూరుపు ? పడమర ఏది మనకు ?
ఏది దక్షిణ, ముత్తర మేది తలప ?
ఏది పై ? ఏది క్రిందు ? ఈ సృష్టి కెల్ల
కేంద్రమున గల మనది పో ఇంద్ర పదవి !

చూడు మా వైపు ! మన వాడె సూతుడొకడు
ఆత్మకున్ గరపును పరమాత్మ కథలు !
అవతరించినవీ అరణ్యముల లోనె
బ్రహ్మమున్ బోధ సేయు ఆరణ్యకములు

భావి చెప్పెద ; భూలోక భావుకులకు
అమృత జీవన మొసగు రామాయణమ్ము
వెలయు, మన వంశమున ప్రభవించు నొక్క
కలుష జీవి తపస్వియౌ కారణమున !

చిత్రమైన దింకొకటి వచింతు వినుము !
మనకు మనుమడె యైన డింభకు డొకండు
వేదముల కొక్క క్రమమును వేర్పరించి,
వ్యాసుడను పేర భారత వ్యాసుడగును !

నీ యంశచే జనించిన
ఆ యమ్మ అరుంధతీ మహా సాధ్వి భువిన్
ప్రేయసుల కెల్ల ప్రియ వర
దాయనియై వరలు శాశ్వతానంద పథిన్ !

(ఆయా విశేషాలు వింటూ, ఆనంద పులకిత చిత్తయై, ఆయా దిశల కేసి అంజలి ఘటిస్తూ వుంది అర్జునకి ! తాను ఈనాటి బాల అర్జునకేనా ? కాదనిపిస్తోంది ! ఎన్ని యుగాలుగా, ఎన్ని వర్షాలుగా, ఎంత దూరం నుంచి ప్రవహించుకొంటు వస్తున్న అమృత వాహినియో తానా ! తానొక అనాది వృద్ధ ! ఆద్యంత రహితమైన ఈ జగత్తుకు ఆద్యంతాలు తానే ! ఓహో ఎంత అద్భుతమైన దర్శనం ! ఎంత ఆనందాను భూతి !)

అర్జునకి

కాంచినాను నీ ప్రణయమ్ము కతన నిపుడు
సార్వ కాలిక మైన విశ్వ ప్రణయము !
అన్ని కాలాల అందాలు, అనుభవములు
నాకు చేకూరి, నేను నేనైతి, సోహో !

(ప్రసన్నుణ్ని కంఠాలింగనం చేసుకొంటుంది. అతడామెను హృదయానికి హత్తుకుంటాడు. అట్టి స్థితిలో దూరంలో నుంచి ఒక నిష్ఠుర వాక్యం వినిపిస్తుంది)

తెరలో

అన్ని కాలాల అందాలు, అనుభవములు
పరిమితమ్ములు కాబోలు ప్రణయమునకై ?
ప్రణయ మిర్వురి సొత్తు మాత్రమ్మె నేమొ ?
తల్లి దండ్రుల కందులో స్థలము లేదా?

(ఇద్దరూ కొంచెం కంగారు పడతారు. విడివిడిగా నిలబడతారు. అప్పుడు ముందు అర్జునుడు, వెనుకగా సోహం రంగంలోకి ప్రవేశిస్తారు. అన్ని కాలాల అందాలు – అన్న పద్యాన్ని మళ్ళీ అంటాడు అర్జునుడు. సోహం ప్రసన్నుడి వంక అదోలా, ఎంత బెంగతో చూస్తాడు. అర్జునకి అన్నగారి వంక ఎంతో ప్రేమగా చూస్తుంది.)

ప్రసన్నుడు

ప్రణయంలో తల్లి దండ్రులకు స్థలం ఎందుకు లేదు, బావా ? సృష్టి సూత్రానికి మూల బీజం తల్లి దండ్రులే కదా ?

ఆత్మయే పుత్రుడై పుట్టు నండ్రు మునులు,
తండ్రి పుత్రుడౌ, పుత్రుడు తండ్రియౌను !
తల్లి దండ్రులె ప్రణయాధి దైవతములు,
ఎల్ల వారును సేవింతు రెపుడు వారి !

అర్జునకి

(అన్నగారిని కౌగలించుకొని) అన్నా!

నాన్న, నమ్మను గాంచి ఎన్నాళ్ళయినదో,
నిన్ను గాంచగ వారి గాంచినటులయ్యె !
ఇప్పటికి నైన నన్నాత్మ నెంచి నావు !
తమ్ము గుర్రలు, చెల్లెంద్రు తలతురె నను ?

నాకు కోపమ్ము కలదు ఎంతైన, ఎవరి
మీదొ - చెప్పుకొందువె ? పందెమిదిగొ ! నేన
నిక్కముగ్ వేపపుల్ల నందీయ కున్న
ముఖము కడగని ఆ కొంటె ముసలి జంట !

పరమ పరమ పరమ స్వార్ధ పరులు వారు !
నేను లేకుండ మనలే మనిరి కదన్న ?
వారిలో తాత కన్న అవ్వయె గయాళి,
తన తెలివి యెంతో ఇక తేల్చుకొనెదు దాన !

అర్జునుడు

(కన్నీరు తుడుచుకొంటూ) చెల్లీ !

పద్మము తొ పోవు మాధురీ పరిమళ రుచి,
చంద్రునితొ పోవు వెన్నెల చక్కదనము,
డెందమున నెంచి ఎవ్వరానంద పడరు ?
మన పితామహుల్ నీకు సాంబ శివు, లశివ !

నిన్ను నీ జంట తో చూచి, నీకు జగము
ఈసు తో చచ్చిపోవు ఆశీస్సు లొసగి,
మన పితామహుల్ కనుమూయ మనుచు నుండ్రి !
ఎంత త్వరగ అందేగిన నంత శుభము !

దైవ దృష్టి గల్గు తండ్రియె మీ యున్కి
చెప్ప లేని యపుడు, చెప్ప గలిగి,
వేగ మిమ్ము తేగ వెడల గొట్టిరి నన్ను,
తిట్టుకొనగ నేల నట్టి సురల ?

మనం ఎంత వేగంగా మనింటికి పోతే అంత మంచిది. ఇది పితరుల ఆజ్ఞ కాదు ! పితామహుల ఆజ్ఞ !

## సోహం

బ్రాహ్మణుడని పిలువగా బడుట యొకటి
తప్ప, బ్రతుకున మరి యొందు తలప నట్టి
తండ్రి నీ మీది బెంగతో తపము మానె !
నిన్ను వేవేగ కొని తేర నన్ను తరిమె !

కఠిన శిల వంటి చిత్తము కలదె యైన ;
అద్దముల నాడె, గడ్డము లప్పు బిడ్డ
లా అనుచు తిట్టు కొనుచున్న ; అమ్మ కనుల
ఆరకున్నది దుఃఖపు టశ్రుజలము !

ఎన్ని నీతులైన ఇతరుల కోసమే !
బ్రహ్మ బోధ కూడ పరుల కొరకె !

మంది లోని ఒక్క మనుజుడు ప్రతివాడు !
సిద్ధుడైన, పరమ శివుడె యైన

ఇప్పుడీ మానవ మనస్తత్వ పరిశీలనా రాద్ధాంతం దేనికి గాని - వయస్యా ! ఇక మనం బయలు దేరడం ఆవశ్య కర్తవ్యం !

ప్రసన్నుడు

(సోహంను కౌగలించుకొని, హృదయానికి హత్తుకొని, [illegible]చి, కన్నులు ఒత్తుకుంటూ–) మిత్రమా !

నాన్న - అమ్మ ! ఈ ఇర్వురు నాకు సములె !
నాన్న పట్టించు కోడు విజ్ఞాని యౌట !
అమ్మ కేవల హృదయ మాత్రమ్ము కాన
విచలితమ్మగు ప్రతి గాలి విసురు నకును !

అమ్మ ప్రకృతి, నాన్న అచల పురుషుడు కాన,
కొల్తు నమ్మ ; నాన్న గొల్తు హృదిని !
నాకు వలయు నిర్వురే కైక బ్రహ్మమ్ము !
నడువు మింక వేగ ! నుడువు లేల ?

(ప్రసన్నుడు దారి తీయగా, అతడి చేతిని చేతితో గ్రహించి అర్జునకి అనుసరించగా, అందరూ ఆశ్చర్యార్ధక మనస్తత్వాలతో అనుసరిస్తారు – తెర !)

# ధర్మ వ్యాధుడు

## అంకం ఆరు

(మతంగ ముని ఆశ్రమం. ఒక మహారణ్యంలో అందమైన ఉద్యానవన మది. మతంగ వాటిక అంతా కూడ ఒకో కుటీరం ఒకో ఉపవనం అనవచ్చు. వివిధ ఫల పుష్ప వృక్ష లతాదుల మధ్య కుటీరాలు కనిపించవు. అట్టి రంగంలోకి ప్రవేశిస్తాడు సోహం. కొంత వికల మనస్కుడిలా కనిపిస్తాడు.)

సోహం

మనిషనగానే ఒక సమస్య ! అసలు, మనిషే ఒక సమస్య ! ఒక సమస్య తీరితే మరో సమస్య తయారు ! ఒక సమస్యలో లక్ష ఉప సమస్యలు !

అసలీ సమస్యలన్నీ ఎందుకు పుడుతున్నాయో తెలియదు ! సమస్య ఒక మహా శక్తి !

ఊరి మీది పిడుగు ఈత చెట్టుపై పడ్డట్టు - అందరి సమస్యలూ నా మీద పడుతూ వున్నై ! పడనియ్ ! పడనియ్ !

ఇప్పుడేం వచ్చిందయ్యా అంటారా ?

అదే ! అసలు సమస్య ! శాకాహారం, మాంసాహారం సమస్య ! అబ్బాయికీ, అమ్మాయికీ ఇష్టమై గాంధర్వ వివాహం చేసుకోవడం వల్ల - గత్యంతరం లేక తల్లి దండ్రు లొప్పుకున్నారే కాని - అసలు సమస్య ఏమై పోయిందీ ?

ఆ ఇద్దర్నీ శృంగార యాత్ర నుంచి వెతికి పట్టు కొచ్చాం. ఉభయుల తల్లి దండ్రులూ సంతోషించారు. అర్జునకీ ప్రసన్నల దాంపత్యం ఎంతో అనుకూలము, అనురూపమూ ! బంధు మిత్రాదులంతా సంతోషించారు. ఎన్నో నియమ నిష్ఠలు గల అజరాదేవి గారు కూడ కోడల్ని చూచి ముచ్చట పడింది. అర్జునకీ దేవి చేస్తున్న అత్తమామల

పూజ నిజంగా అపూర్వం ! భర్తను సాక్షాత్తు దేవుడి లాగే అర్చిస్తుందామె. అంతా బాగానే వుంది. కాని –

హఠాత్తుగా ఏం జరిగిందో తెలియదు !

నేటి ఉదయం అజరా దేవి గారు ఏదో అన్నది. అర్జునకీ దేవికి కోపంతో ముఖం ఎర్రబడి పోయింది ! చంద్రుడి లాంటి ఆ ముఖం సూర్యుడిలా అయిపోయింది ! అంత శాంతం ఏమై పోయిందో ? అంత కోపం ఎక్కడి నుంచి వచ్చిందో !

అంతే –

ఒక్క మాటైనా మాటాడ కుండా, ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది !

మా ప్రసన్నుడికి మతి పోయింది !

ఇదంతా నా చావుకు వచ్చింది.

ఇప్పుడేం చెయ్యను !

"నీ కున్నట్టే, వియోగ బాధ ఆమెకు కూడ వుంటుందయ్యా, స్వామీ !" అంటే వినడం లేదు !

"ఉంటుంది. నిజమే. కాని, కోపగించిన స్త్రీకి నిగ్రహశక్తి అధికం. ఎంత గాఢ ప్రేమనైనా, ఎంత తీవ్ర వియోగాన్నైనా, కోపం గల స్త్రీ ఎదిరించి నిలవగలదు. ఆమె కోపగించి పోయింది. మళ్ళీ తిరిగి రాక పోవచ్చు" అంటా డతడు.

కావచ్చునేమో ! నాకేం తెలుసు !

ఉదయమే వెళ్ళి పోయిందామె. సాయంత్రానికి తిరిగి రాకపోతే ఏమిటి గతి?

కోపం అత్త మీద గాని, భర్త మీద కాదుగా !

ఇంతకూ అత్త మాత్రం ఏమన్నది ?

జంతువుల జంపి తినువాని జాతి నీది,

ఇంత కన్నను బుద్ధి నీకెట్టు లుండు ?

అన్నదట !

అత్తగారి పెత్తనం కాకపోతే, మరోసారి పిలిస్తే ఏం పోయిందీ !

భర్త గదిలో వున్న స్త్రీకి మరొకరి పిలుపు వినిపించక పోవడంలో తప్పేం వుందీ?

అయినా -

అంత చిన్న తప్పుకు, జాతి పేరుతో నిందించడం ఏమి న్యాయం ? వ్యక్తి తప్పు చేస్తే, ఆ వ్యక్తినే నిందించాలి. జాతి నెందుకు నిందించడం ? ప్రతి జాతిలోను మంచి వాళ్ళు, చెడ్డ వాళ్ళు కూడ వుండరా ?

మాంసం తినే జాతిలో వాళ్ళకి బుద్ధి వుండదా ? అయితే, ఈ శాకం తినే జాతిలో వాళ్ళందరికీ బుద్ధి వున్నదా ?

వ్యక్తి చేసిన పొరపాటుకు జాతి పేరుతో నిందించడం బుద్ధి వున్న పనేనా ?

కొందరికి నోరే గాని, బుర్ర వుండదు ! నోటికి ఎంత వస్తే అంత అనేస్తూ వుంటారు ! అది మరొకళ్ళ బుర్రకు రామ కీర్తన పాడుతుంది !

పాపం మతంగుల వారికి ఈ గోలే ఏం తెలీదు ! ఆయనకు చెప్పే ధైర్యమూ ఎవళ్ళకీ లేదు !

సూర్యుడు హస్తగిరికి పోతూ వున్నాడు ! ఇప్పుడేమిటి చెయ్యడం ?

(హఠాత్తుగా దూరంలోకి చూస్తాడు. ఆనందంతో ఎగిరి గంతు వేస్తాడు !)

బ్రతికాం ! నే చెప్పలే ? నా ఊహ ఎప్పుడూ తప్పదు ! సమస్య తీరినట్టే. కాని - అసలు సమస్యనే వెంట బెట్టుకు వస్తున్నదామె ! ధర్మ వ్యాధుల వారే స్వయంగా వస్తున్నారు ! ఓహో ! జానకీ జనక మహర్షుల్లా వున్నారు వారు ! (నాలుక కరుచుకొంటాడు తన అతిక్రాంతో పమకు !) నేను కూడ దైవజ్ఞుణ్ని అవుతున్నానే ! ఆశ్చర్యమే !

ఈ వస్తున్న ప్రమాదం గురించి మతంగుల వారికి ముందుగానే తెలియజెయ్యాలి.

(హడావిడిగా ఒక వైపుకు నిష్క్రమిస్తాడు. రెండోవైపు నుంచి ధర్మవ్యాధుడు, అర్జునకి ప్రవేశిస్తారు. మౌనంగా, గంభీరంగా వున్నారు. ధర్మవ్యాధుడు రంగంలో చుట్టూ పరికించి చూస్తాడు.)

అర్జునకి

నాన్నా ! అదిగో, మా మామగారు, మతంగుల వారు ! ఇటే వస్తున్నారు ! నేను వారి కంట బడటం బాగుండదు. నేను లోనికి పోతా !

ధర్మవ్యాధుడు

సరే వెళ్ళు ! వీళ్ళ సంగతేదో నేను తేలుస్తా !

(అర్జునకి ఒక వైపుకి నిష్క్రమిస్తుంది. అదే వైపు నుంచి మరొక దారిని మతంగ మహర్షి ప్రవేశిస్తాడు. ధర్మవ్యాధుడి వయస్సే. అదే తేజస్సు. గడ్డమూ, చూడా బంధమూ మాత్రం అధికం. అవి రెండూ, యోగ దండమూ, ప్రత్యేక ఠీవీ, బ్రహ్మ వర్చస్సూ - అతడొక మహా తపస్వి అని చెపుతూ వున్నై.)

ధర్మవ్యాధుడు

అదిగో, మతంగ మహర్షి, అతడెంత అహంకారో, అంత మర్యాదా మధురుడు! ఎంత కఠిన వ్రతుడో, అంత ఆత్మవత్ సర్వభూతానుడు ! ఎంత చండాలుడో, అంత బ్రాహ్మణుడు ! అయినా, నా రాకకు కారణం మతంగుడికి తెలియదు. మతంగునిపై ఎంత గౌరవం వున్నా, నా మనస్సు మండిపోతూ వుంది !

మతంగుడు

(ఆనంద పులకిత చిత్తంతో) ధర్మవ్యాధులు ! ఎంత ధన్యులం మేం ! మా ఆశ్రమం పునీత మయింది నేడు ! (నిట్టూర్చి) ఎందరెంత వేదాంతం బోధించినా-

ధరణి నవ తార మూర్తుల దర్శనమ్ము,
మైత్రి, మోక్షమ్ము కోరునే మనుజుడైన
ఎట్టు లైనను వారితో చుట్టరికము
నెరప వలసిన నిజ మిప్డు నేర్చినాడ !

మాకు చుట్టమౌట, మాలోన నొకరైతి,
వడుగ కుండ వచ్చు వరమ వైతి,
వార్య ! నీవు బంధువైన కతమ్మున
ధన్యు లైతి మేము ధర్మ ధరణి !

నీకు కూతురు, కోడలు నాకు ; కాన
ఇర్వురకు నామె మోక్ష దాయిని గదయ్య !
ఆమె సుఖమున్న దింట ప్రేయసుని గూడి !
స్వాగతము ! రమ్ము ! నీ కిదే స్వాగతమ్ము !

ధర్మ వ్యాధుడు

(మతంగుని కౌగిలించుకొని, భుజం గట్టిగా కుదిపి, వెటకారంగా) మహా తపస్వీ !

గడ్డి మాత్రము తిను నీవు గార్ద భమవు,
మాంసమున్ తిను నేను సింహమును ; మనకు
చుట్టరిక మేమిటయ్య ? నా సుత కతాన
రాక తప్పక వచ్చితి రాత కొలది !

జంతువుల చంపి తినువాని జాతి యంచు
జాతినే తిట్టునది యెట్టి జాతో, చెపుమ !
వ్యక్తి తప్పు చేసిన వ్యక్తి ననవలయును ;
మంచి చెడులకు జాతి సంబంధమేమి ?

మతంగుడు

(ఆశ్చర్యంతో) మహామతీ ! ఏమిటిదంతా ?

ధర్మవ్యాధుడు

(ధోరణి మార్చకుండా) పోనీ, నా కూతురు కటిక వాని కూతురే కావచ్చు. మరి నీ ఇల్లాలు ఏ విశిష్ట చక్రవర్తి కూతురో చెప్పు, చూతాం !

(ఈ లోగా సోహం ఒకటి రెండు సార్లు రంగంలోకి వచ్చి పోతాడు. బైట జరుగుతున్న దంతా లోపల అందరికీ తెలుస్తూనే వుంది.)

మతంగుడు

(ధర్మ వ్యాధుడి భుజం గట్టిగా ఊపి) శాంతించవయ్యా, స్వామి ! అసలు జరిగిందేమిటో చెప్పి, అప్పుడు కోపపడు !

నీ కుమారి పతివ్రత, నిర్మ లాంగి ;
ఆమె నెవరైన నేమైన అనిరె చెపుమ !
విరసమున పేరు గన్న నీ వీపరాలు
అన్నదో అనరాని దేదైన నిన్ను ?

నిత్యమేవొ యేవొ నియమ నిష్ఠల లోన
మునిగి యుండు నట్టి ముసలి దామె !
లేదు లోక దృష్టి, చాదస్తమును జాస్తి,
ఆమె మాట కేల అంత విలువ ?

హింస చేసెడి వారలు హీను లామె
తలపులో, పుట్టినది విప్ర కులము కాన !

మాదిగ నటంచు నను కూడ మాటలనును !
ఆమె మాటలతో పని యేమి మనకు ?

ఇంతకు – ఏమి జరిగిందో చెప్పవయ్యా, బావా ! మహానుభావా !

ధర్మవ్యాధుడు

ఏమి జరిగిందో నీ ఇల్లాలినే అడుగు ! అడిగి, నాకు జవాబు చెప్పు–

అత్త, మామొ, మగడొ – అమ్మాయి నేలెడి
దెవరొ ఖచ్చితముగ ఎరుగ జెప్పు !
అట్టి వ్యక్తి తోడ అంతు తేలుచు కుని
చనెడు వాడ ! పనులు చాల కలవు !

జంతు హింస వల్ల జాతి నీచత గన్న,
మనుజ హింస వల్ల మహిత మగునె ?
స్వర్గ మేదొ వచ్చి చంకెక్కునే మీకు
జాత పేర పరుల చావ దిట్ట ?

(అప్పుడు అజరాదేవి ప్రవేశిస్తుంది. ఆమె నిశ్చలచిత్త. ఒక విధంగా గౌతమి వలె వుంటుంది. అంతకంటె చిన్నదిగా, ఆమె చెల్లెలేమో అనిపిస్తుంది. ప్రసన్న వదనంతో, చిరునవ్వు నవ్వుతూ వచ్చింది. ధర్మవ్యాధుడికి నమస్కారం చేసింది.)

అజరాదేవి

మీ సంభాషణ అంతా విన్నా, అన్నయ్యా ! ఏదో పొరపాటై పోయింది గాని – నేనే రావాలను కొంటూ వుండగా, నీవే వచ్చావు. నేను వచ్చి, నీకు క్షమాపణ చెప్పుకొని, కోడల్ని తీసుకు వద్దామనుకున్నా. పెద్దవాడవు. నన్ను క్షమించు !

(మతంగునితో) అన్నయ్యను వాకిట్లోనే నిలబెట్టి మాట్లాడుతున్నారా ? ఏమి చాదస్తమండీ ! (ధర్మ వ్యాధుడితో) లోపలికి రా అన్నయ్యా ! అంతదూరం నుంచి నడిచి

వచ్చి, ఇక్కడ వాకిట్లో నిలబడడం ఏమిటీ? (లోపలికి చూచి) అర్జునీ ! ప్రసన్నా ! ఎక్కడర్రా ?

(అంతలో లోపలి వారు రంగంలోకి వచ్చి వెళతారు. అంతకు ముందు కూడా తొంగి చూస్తూనే వున్నారు. సోహం రంగంలో అటూ ఇటూ తిరుగుతూనే వున్నాడు.)

**నేపథ్యవాణి**

అజరా దేవి వైఖరి మతంగుణ్ని ఆశ్చర్య చకితుణ్ని చేయగా, ధర్మ వ్యాధుణ్ని చాల తిక మక పెట్టింది. అతడు మరి మాట్లాడలేకపోయాడు. మానవ జాతికి అతి ముఖ్యమైన సమస్యల్ని ఇలా తేలికగా తీసుకోవడం వల్లనే అవి పరిష్కారం కాకుండా జటిల తరం అవుతున్నా యేమో ! మనిషి గుండెల్లో పొడిచి, పొరపాటు క్షమించు మనడంలో అర్థమే మిటి? క్షమించక చేసేది మాత్రం ఏమిటి? అవతలి వ్యక్తి గుండెల్లో తాము చేస్తున్న గాయం బాధను అర్థం చేసుకోరు మనుష్యులు ! ఇన్ని భావాలు ధర్మ వ్యాధుడి మనస్సులో పరుగులు తీశాయి. కాని – ఏం చేస్తా దతడు !

**మతంగుడు**

ఔను ! మాటల్లో మరిచే పోయాను ! బావా ! ఇక, లోనికి పోదాం, పద !

**ధర్మ వ్యాధుడు**

(శాంతంగా) ఇంటి వద్ద నాకు చాల పనులున్నై. నేను వెంటనే వెళ్ళ వలసి వుంది. అమ్మాయిని అప్పజెప్పి పోదామని తప్పనిసరిగా వచ్చాను. ధర్మంగా ఏలుకోండి! జాతి పేరుతో గాని, వంశం పేరుతో గాని, తలి దండ్రుల పేరుతో గాని, వృత్తి పేరుతో గాని ఎవరినైనా నిందించడం కూడని పని. వ్యక్తికి ప్రధానం గుణం. కులం కాదు. ఏ మంచి గుణాన్నీ, ఏ ఒక్క జాతీ గుత్త గొనలేదు. అజ్ఞానంతో భారత జాతిని నాశనం చెయ్య వద్దు. ఇక సెలవు. (పోబోతాడు)

**మతంగుడు**

అలా వీల్లేదు. ఏమిటి దంతా ? (ధర్మ వ్యాధుడి చేయి పట్టుకుంటాడు.)

అజరా దేవి

భోజనం చేసి గానీ కదలడానికి వీల్లేదు, అన్నయ్యా !

ధర్మ వ్యాధుడు

(నవ్వుతూ) భోజనము ? నేను తినే పదార్థం మీరు నాకు ఎలా పెట్టగలరు?

మతంగుడు

మాంసం లేకుండా ఒక్క పూట కూడా భోజనం చెయ్య లేవా ?

ధర్మ వ్యాధుడు

ఎందుకు చెయ్యలేను ? చెయ్యగలను. సమస్య అది కాదు. నిజానికి, రోజు కొక్క జీవిని తప్ప - అంతకు మించి నేను చంపనే చంపను. అయినా, మీరు నాకు పెట్ట గలిగిన పదార్థ మేముంది ?

అజరాదేవి

మేం తినేదే నీకూ పెడతాం.

ధర్మ వ్యాధుడు

నేను మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు తినేదే నాకూ పెడతారు. మీరు నన్ను మీ ఇంటికి పిల్చినప్పుడు, నేను తినేది నాకు మీరు పెట్టవలసి వుంటుంది. అదీ ధర్మం. సరే. నేనే మీ ఇంటికి వచ్చాను, కనుక - మీరు తినేదే నాకు పెట్టవచ్చు. అయితే - మీరేం తింటారు ?

అజరాదేవి

(నవ్వుతూ) శాకాహారు లంతా ఏమి తింటారో, అదే !

ధర్మవ్యాధుడు

ఏమిటది ? పేరు లేదా ?

**అజరాదేవి**

వడ్లు, గోధుమలు, యవలు, దుంపలు, కాయలు -

**ధర్మవ్యాధుడు**

ఏమిటవి ? చూపండి ?

(ఆశ్చర్యంగా చూస్తుంది. మతంగుడు హెచ్చరిస్తాడు.)

**మతంగుడు**

పోనీ చూపగూడదా?

**అజరాదేవి**

(లోనికి పోయి, ఒక చేటలో ధాన్యంతో ప్రవేశించింది. ఆ వెనుక అర్జునకి మరొక చేటలో ఏవో తెచ్చింది.)

**అజరాదేవి**

ఇవి గోధుమలు. అవి -

**ధర్మవ్యాధుడు**

(వాటిని చేతితో తాకి చూచి, వళ్ళు జలదరించుకొని) హరిహరీ ! వీటినా మీరు తినేది ? ప్రతి పూటా ఇన్ని లక్షల జీవ రాశుల్ని చంపి తింటున్నారా ? హింస ! ఘోర హింస ! (వెనక్కి తొలగి నిలబడి) నేను చంపేది రోజుకొక్క జీవిని మాత్రమే ! ఇన్ని లక్షల జీవుల్ని ప్రతిపూటా చంపి తింటున్న మీ ఇంటి భోజనం పాప భూయిష్టం కదా !

(నిశ్చేష్టులై నిలబడి వున్న వారందరినీ కలయ జూచి, కొంత శాంతించి)

**జనము కొరకొక్క మృగమును జంపు నన్ను**
**జీవ ఘాతి యటంచు దూషించి, పూట**

కిన్ని జీవుల జంపి భుజించు మీరు
ఎంత చెడ్డ ఘాతకులో ఊహింప తరమె !

కు య్యొ మొర్రో యటంచు మీ పొయ్యి మీద
తన్ను కొని చచ్చి పోయిన కన్నె జీవ
బీజ శవ భోజనము నాకు పెట్ట నేల ?
ఇంత హింసను నా యొడి కెత్త నేల ?

పెట్ట గలిగి యున్న పెట్టుడు నిర్జీవ
భోజనమ్ము ; చేసి పోవు వాడ !
పెట్ట లేని యెడల, పెట్ట లేమని చెప్పి,
హితము తెలిసి బ్రతుకు డింక నైన !

గాలి నైనా పీల్చగా లేరు సుడి మీరు
హింస విడిచి బ్రతుక నెంతురేని !
జీవ కణములను నశింప జేయును గాన
పస్తులుండుట యును ప్రాణి హింసె !

అజరాదేవి

(చేతులు మోడ్చి) నా కళ్ళు తెరిచావు. నాకు బుద్ధి గరిపావు. నా అహంకారానికి మంచి చికిత్సే చేశావు. నీ కనేక వందనా లన్నయ్యా !

మతంగుడు

ఎదుటి వాళ్ళు అజ్ఞాను లనుకొంటూ, అంతకంటె అజ్ఞానంతో అహంకరించి, ఆత్మ జ్ఞానం కేసి దృష్టి సారించని మాకు వెలుగు బాట చూపావు, బావా ! ఇవే నీకు నా నమస్కృతులు.

(అప్పుడు అర్జునకీ ప్రసన్నులు ముందుకి వచ్చి, ఎదుట నిలబడతారు. ధర్మ వ్యాధుడు వారిని చేయెత్తి ఆశీర్వదిస్తాడు.)

ధర్మవ్యాధుడు

కొడుకో - కూతురో - బ్రహ్మ చర్యముకు వీ
డ్కోలిచ్చి ; హృత్సూత్రపుం
ముడితో, వేముడి తో వరించి కొని, స
ప్రేమ్మో దమ్ము తో కూడి యే
దడుగుల్ వైచిన యప్డె తద్వయ మొకే
అద్వైతమో ; కాన, ఏ
యిడుముల్ కల్గిన, త్రెంచుకోవలదు సుం
డీ, తత్పరా బంధముల్ !
జంట గలిసి ఒక్క యింటి వారైనాక,
తగిన స్వేచ్ఛయును, స్వతంత్రతయును
పొంద వలయు బిడ్డ లెందైన తలి దండ్రు
ల కడ నుండి ; పనికి రాదు జడత !

సొంత యింటి నుండి, సొంతాన బ్రతుకుచు,
తనర వలయు తల్లి దండ్రి సేవ !
పెట్టు పోత లేమి పిత్రార్జితము తోడ ?
కలియుగంపు పాప కర్మ లవ్వి !

తల్లి దండ్రుల యింటిలో తాను మనుచు,
తల్లి దండ్రుల దబ్బును తాను తినుచు,
ఇంక తల్లి దండ్రులను సేవించు టేమి ?
కావున స్వతంత్ర జీవులు కందు మీరు !

అత్త మామలు తమ గృహ మందు నేదా
అనుట, నొప్పించు, టందు నిందును సమమ్మె ;
అత్త పెత్తన వాభ్యుదయముకు చేట ;
మీకు మీ రుండి, పెరుగుడు మింటి దాక !

తప్పు చేయని నరుడు లేడిప్పుడమిని ;
తప్పులు రగుల్చుకోకుడు నిప్పులట్లు ;
బూది చేయగ గలవు నిప్పులు బ్రతుకును;
హృదయమే మగునన్నది కద సమస్య ?

ఒకరి నొకరు విడిచి యింట పస్తుందుట !
విడిచి పెట్టుకొనుట విషము తినుట !
తనువు కాదు, మనసు తగులమ్మ ముఖ్యమ్ము !
త్రెంచి వేయు కొలది మించు చిక్కు !

నదికి తన కంటె పెద్దదౌ ఉదధి యెట్లొ,
ఆత్మ కట్టులె మహిత తరాత్మ సిద్ధి !
కనుక, మనసెందు ప్రణయాన కరగి నదియొ
దాని వీడదీయ నెంచరు ధర్మ విధులు !

తల్లి దండ్రుల పూజలు తప్పకుండ
అతిథి మర్యాదలకు లోప మంట కుండ
విష్ణు నామ కీర్తనమును వీడ కుండ
తపము చెడ కుండ మనుదు చంద్రార్క దీప్తి !

(అప్పుడు సోహం ముందుకు రాగా, అతడి చేతిని చేతిలోకి తీసుకొని, అందరి వంకా ఒకసారి చూచి, ధర్మ వ్యాధుడు నిష్క్రమిస్తాడు. అందరూ భక్తితో అతడి మార్గానికి అంజలి ఘటిస్తారు. మెల్లగా తెర పడుతుంది.)

# ధర్మ వ్యాధుడు

## అంకం ఏడు

(లోహదండం అనబడే మహారణ్యం ఒక ప్రాంతం. ఫలపుష్ప పరిమళ మధురమై, శుక పిక శారికా స్వర సంకులమై, చందన మందానిల శీతలమై, ఎంతో హాయిగా వుంది వనం. ఒక ప్రక్క నుంచి శ్రీహరి, రెండో ప్రక్క నుంచి భూదేవి రంగంలోకి ప్రవేశిస్తారు. శ్రీహరి ఆదివరాహ మూర్తి రూపంలో వున్నాడు. ఆయన చేతిలో పద్మం వుంది. భూదేవి చేతిలో ఫలం వుంది. ఇద్దరూ వాటిని పరస్పరం బహూకరించుకొంటారు సవిలాసంగా)

శ్రీహరి

ఇది వాడని పువ్వు (అందిస్తాడు)

భూదేవి

ఇది వీడని ఫలం (అందిస్తుంది)

శ్రీహరి

(మెప్పుతో) పువ్వు వెంటనే ఫలించింది !

భూదేవి

(సిగ్గుపడుతూ) అది మీ చేతి చలువ !

శ్రీహరి

(సాదరంగా ఆమెను ఒడిలోకి తీసుకొని వదిలేసి) దేవీ !

నామగుణ రూప శూన్య శూన్యమ్ము నుండి
ఏ మహత్తు జనించెనో యేమొ గాని -

బృహదహంకార పురుష విజృంభమునకు
మోక్షమున్ జూపి నావు నీ వుద్భవించి !

గాఢ శూన్యమ్ము నీ ఊహ కతన కాదె
కలలు గాంచెను ? నీ స్పర్శ కతన కాదె
నిద్ర లేచెను ? నిన్ను వాంఛించి కాదె
విక్రమించెను విశ్వ విశ్వేశ శక్తి ?

భూదేవి

మహాశయా ! ఎప్పటి నుంచో అడగాలను కొంటున్నాను. నేనెవరు ? నీ వెవరు?

శ్రీహరి

దేవీ ! మేధావులూ, ప్రవక్తలూ, మహర్షులూ అందరూ మానవుడు మానవుడుగా వికసించి నప్పటి నుంచీ కూడ అడుగుతూ వచ్చిన ప్రశ్నే ఇది. ప్రశ్న ఎంత సులభమో, జవాబు అంత అయోమయం. నేను నిన్ను ఉద్ధరించింది అది వరాహ రూపంతోనే. నేను నిన్ను ప్రేమించిందీ ఈ రూపంతోనే ! మన ప్రకృతి పురుష నైరంతర్యమూ ఈ రూపంతోనే. భూదేవి హరిప్రియ. అంటే అది వరాహ మూర్తి భార్య అన్నమాట. అష్టలక్ష్ములూ నాకు భార్యలే. దశావతారాలూ నీకు భర్తలే. ఇది వైదిక చింతన. మానవుడికి సులభంగా తెలియడం కోసం నేను సూర్య స్వరూపుడిగా వుంటున్నాను.

బ్రహ్మ స్వరూప ముదయే
మధ్యాహ్నేతు మహేశ్వరం
సాయం ధ్యాయేత్ సదా విష్ణుం
త్రిమూర్త్యంచ దివాకరం !

సృష్టి స్థితి లయాలకు రూపకల్పన చేసి, వ్యక్తిత్వాలు కల్పించి, మానవులు ఉపాసిస్తున్న త్రిమూర్తులూ ఒకే విశ్వశక్తికి మూడు దశలు. అదే పరబ్రహ్మ. అదే సూర్యుడు.

అదొక జ్వలిస్తున్న శక్తి. ఈ శక్తి తరంగాల నుంచే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృధ్వి పుట్టినై. జలం నుంచి పృధ్విని కల్పించింది నేను వరాహ రూపంతోనే. అప్పటి నుంచీ మనిద్దరం ఒక జంట. సృష్టిలో జీవ రూపం ఉద్భవించింది అప్పటి నుంచే.

(అప్పుడు నేపధ్యం నుంచి విష్ణు సంకీర్తనం వినిపిస్తుంది. హరి, భూదేవి సావధానంగా వింటారు.)

**నేపధ్యం నుంచి**

**విష్ణు ర్నామ మహా యోగీ**
**మహా భూతో మహా తపాం**
**తత్వ మార్గే యధా దీపో**
**దృశ్యతే పురుషోత్తమ :**
**అసతోమా సద్గమయ**
**తమ సోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

(ఈ హరి సంకీర్తన పూర్తి పాఠం వరాహ పురాణంలో వుంది. అవసరమనుకుంటె దానిని పూర్తిగా పఠించవచ్చు.)

**శ్రీహరి**

ధర్మ వ్యాధుడు తపస్సు చేస్తున్నాడు.

**భూదేవి**

అతడు తపస్సు చెయ్యడ మేంటి ? ప్రభూ ! తపస్సే అతడి స్వరూపం కదా!

**శ్రీహరి**

అవును దేవీ ! అవును. అయితే మానవుడిగా వున్నాడు కదా ! మానవనైజం అతడిని అంటి వుంది. లౌకిక బాధ్యత లన్నిటినీ నెరవేర్చిన అతడు వృద్ధాప్యంలో సహజంగానే ధ్యాన మగ్నుడై ఏకాంతంగా జీవితాన్ని ముగించుకొంటున్నాడు. నేను వెళ్ళి అతడికి దర్శనమిచ్చి వస్తాను.

(ఇద్దరూ చెరొక వైపుకీ నిష్క్రమిస్తారు. అపుడు తెర లేస్తుంది. అదే మహారణ్యం. ఒక వృక్షచ్ఛాయలో ధర్మవ్యాధుడు తపస్సు చేసుకుంటూ కనిపిస్తాడు. అతని ముందు శ్రీహరి ప్రత్యక్ష మవుతాడు.)

శ్రీహరి

భక్త వరేణ్యా ! ధర్మవ్యాధా ! నీ తపస్సు ఫలించిందయ్యా. నీవు నాలో ఐక్యమై పోతున్నావిప్పుడు. నీకేమైనా కోరికలుంటే ఇపుడే తీర్చుకో.

ధర్మవ్యాధుడు

వచ్చావా స్వామీ ! నా కర్తవ్యం ముగించుకుని నీ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నా నిన్కడ. ఇప్పుడు నాకే కోరికలూ లేవు. అయినా ఇస్తానన్నావు కాబట్టి అడుగుతున్నాను. నాకు నా నందనులకు -

నాకు నా నందనులకు
దయచేయు మాత్మ విద్యా యుక్త సకల క
ళా వత్క విత్వంబు దేవదేవ !
వసుమతిపై అధవా నన్ను బుట్టింప
నూహ కల్గిన ధర్మ యుగము నంద
పుట్టింపు, మద్వంశమున జనించిన వారి
విజ్ఞాన పరుల గావింపు మంత
నీమేన లయముగా నాదరింపు!

శ్రీహరి

ఓయి మహా కవీంద్ర ! అద్భుతమైన వరం కోరావయ్యా ! యుగ యుగాలుగా యుగ కవులు నీ బోయ వంశంలోనే జనింతురు గాక ! వాళ్ళు విద్యా, విజ్ఞాన, కళా, వేదాంత రంగాలలో నాతో సమానులై వుందురు గాక ! ఇక నా లోకి వచ్చేయ్ !

(జిగేలు మంటూ కనులు మిరు మిట్లు గొలిపే ఒక కాంతి రంగం నిండా ప్రసరిస్తుంది. అంతా చీకటై పోతుంది)

ఓం తత్ సత్ తత్ సత్ తత్ సత్. - తెర.

* * *